ప్రజాశక్తి

సోపతి

అక్టోబర్ 19, 2014 ఆదివారం అనుబంధం



చిత్ర కళా మాలిక

1913 1930 1968 1979 1983 1998 2014



- స్వీడన్ కథ: పులుసు రాయి
- బెల్లి యాదయ్య, కోటం చంద్రశేఖర్ కవితలు
- ఆయుష్షును పెంచే నిద్ర
- సరళమైన భాషలో బాల సాహిత్యం

చిత్రకళలో విప్లవాత్మక శైలి

"చిత్రకళకు జీవం పోసిన వాడిని నేను. ప్రకృతిలో ఏముందో నా చిత్రాలలోనూ అదే ప్రతిఫలిస్తుంది" అని సగర్వంగా చెప్పిన చిత్రకారుడు గియాట్టో. బైజాంటియన్ సంప్రదాయంపై తిరుగుబాటుగా ఇటలీలో వెల్లువెత్తిన చైతన్యానికి ప్రతీకలు గియాట్టో చిత్రాలు. ఇటలీలో ఒక పేద రైతు కుటుంబంలో 1267లో జన్మించారు. దాదాపు డెబ్బయి సంవత్సరాలు జీవించి, 8 జనవరి 1337లో ఈ లోకం నుంచి నిష్క్రమించారాయన. గియ
మధ్యయుగాల నాటి స
సంబంధించిన చిత్రకళారీ
లాస్ట్ జడ్జిమెంట్ చిత్రం
నిలిచివుంది. మానవ ఉదే
ద్వారా తెలియజెప్పారు.
తెలుసుకోడానికి ఉపకరిం
తిరుగుబాటుగా సృజనకు
తర్వాతి తరం చిత్ర

స్వేచ్ఛాపిపాసి ఎం.ఎఫ్.హుస్సేన్

ఇరవయ్యో శతాబ్ది భారతీయ చిత్రకళా రంగాన్ని అత్యంత ప్రభావితం చేసిన చిత్రకారుడు ఎం.ఎఫ్.హుస్సేన్. ఆధునిక ప్రతీకాత్మక నైరూప్య చిత్రాల్ని సృజించడంలో ఆయనది ప్రత్యేక బాణీ. ఆయన శతజయంతి సంవత్సరమిది. హుస్సేన్ 17 సెప్టెంబర్ 1915లో జన్మించి, 9 జూన్ 2011న ఈ లోకం నుంచి నిష్క్రమించారు. తను బతికిన కాలంలో ప్రతి దశనీ సృజనాత్మకంగా మలుచుకున్న కళాకారుడు. స్వాతంత్ర్యానికి పూర్వం 'ప్రోగ్రెసివ్ ఆర్టిస్ట్స్ గ్రూప్'ను ఏర్పాటు చేసిన హుస్సేన్‌కు కళ ఎవరికోసమన్న అంశంపై స్పష్టమైన అవగాహన వుంది. కనుకనే జీవితపర్యంతం లౌకికవిలువలతో చిత్రరచన గావించారు. బొమ్మల్లోని ఇతివృత్త వైశాల్యం హుస్సేన్ స్వేచ్ఛాప్రియత్వాన్ని తెలియజేస్తుంది. భారత ప్రజలు, జానపద సంప్రదాయాలు, పశుపక్ష్యాదులు, భారత పురాణాలు, ఇతిహాసాలు, అందులోని పాత్రలు, సామాజిక సంఘర్షణలు ఆయన్ని స్పందింపజేశాయి. కనుకనే ఆయన కుంచె ప్రతి అంశాన్ని చిత్రించింది. తన జీవితకాలంలో దాదాపు పదివేల బొమ్మలు వేసి వుంటారని అంచనా. తన చిత్రాల కారణంగా వివాదాలకు లోనయ్యారు. కానీ కళాకారునిగా తన స్వేచ్ఛను హరించే వైఖరిని భరించలేకపోయారు. కార్మికోద్యమ నాయకుడు శంకర్‌గుహ నియోగి హత్యకు గురయినపుడు హుస్సేన్ వేసిన బొమ్మ ఎందరినో ఆకట్టుకుంది. తన బొమ్మలు కోట్లాది రూపాయల సంపాదన తెచ్చిపెడుతున్నా తన మూలాల్ని, భావజాలాన్ని హుస్సేన్ విస్మరించలేదనడానికి ఈ చిత్రం తార్కాణం. హైదరాబాద్ నగరమంటే హుస్సేన్‌కు ప్రత్యేకమైన ఇష్టం. తనకో ప్రత్యేక నివాసాన్ని ఏర్పరుచుకున్నారు. అయినప్పటికీ చివరిదశలో స్వేచ్ఛకోసం అన్నిటినీ వదులుకొని లండన్ వెళ్ళారు. అక్కడే బొమ్మలు వేస్తూ లోకం నుంచి నిష్క్రమించారు.



ప్రశాంత చిత్తం

అనేకానేక సంక్లిష్టతలున్న సమాజంలో హాయిగా, ప్రశాంతంగా, నిశ్చింతగా ఉండడం సాధ్యమా? ఎంత స్థితప్రజ్ఞతతో ఉందామనుకున్నా ఏవో సమస్యలు, సంక్షోభాలు వచ్చిపడుతుంటాయి. వాటిని తట్టుకుంటూ శాంతంగా ఉండగలరా? ఒత్తిళ్ళనీ, ఆందోళనలనీ అధిగమిస్తూ మానసిక శాంతిని సాధించగలరా? సాధించాలి. ఈ లోకంలో నాలుగుకాలాలు బతకాలంటే శాంతంగా, ధీరచిత్తంతో ఉండాలి. మన ప్రమేయం లేకుండా కాలం సాగిపోతూనే వుంటుంది. రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు గడిచిపోతుంటాయి. కాల ప్రవాహంలో మనం ఎంత ప్రశాంతంగా మన పనులు మనం చేసుకుంటూ పోతామో ఆ మేరకు శాంతిని సాధించగలం. దీనికి శ్రమించాలి. శోధించాలి. శోధించి సాధించడంలోనే అందం వుంది. ఇది మానసికమైన ప్రశాంతతని పొందే విషయంలోనూ వర్తిస్తుంది. మనసును ఒత్తిళ్ళకీ, ఉద్వేగాలకీ అతీతంగా ఉంచుకోడం మనిషి చేతిలోనే వుంది. సమస్యలతో కూడిన దైనందిన జీవితంలో శాంతంగా ఉండటం మరింత అవసరం.

ఈ ప్రపంచం పుట్టినప్పట్నించి సమస్యలు వస్తున్నాయి, పోతున్నాయి. మనిషి ప్రయాణం కొనసాగుతూనే వుంది. మరి అలాంటప్పుడు శాంతంగా జీవించడం నేర్చుకుంటేనే బతుక్కి అందం, ఆనందం. పేదలయినా, ధనికులయినా సమస్యలు వస్తూనే వుంటాయి. వాటిని పరిష్కరించుకుంటే ముందుకు వెళ్ళడమే మార్గం. ఆందోళన చెందడం వృధా ప్రయాస. మీ బాధ్యతల్ని మీరు నెరవేర్చాలి. మీ కర్తవ్యం మీరు నిర్వర్తించి ప్రశాంతంగా వుండాలి. ఫలితం గురించి యోచించకూడదు. ఏదో జరిగిపోతుందని బెంబేలు పడకూడదు.

అంతేగాక మనసులో చెలరేగే ఆలోచనలన్నిటినీ పక్కనపెట్టి ప్రతిరోజు నిశ్శబ్దంగా, ప్రశాంతంగా ఉండటానికి ప్రయత్నించాలి. దీని కోసం మీ మనసులో మీరు ప్రశాంతమైన గదిని నిర్మించుకోవాలని చెబుతారు 'ది న్యూ సైకో సైబర్నటిక్స్' రచయిత మాక్స్‌వెల్ మాల్ట్జ్. సమస్యలు, ఒత్తిళ్ళు, ఆందోళనలు లేకుండా కొద్దిసేపు సేద దీరడానికి ఈ గదిలోకి వెళ్ళిపోవాలి. కళ్ళు మూసుకొని కూర్చుండిపోవాలి. ఇతరేతర ఆలోచనలు దరి చేరకుండా, మీ కోసం మీరు మీ మానసిక ప్రపంచంలో నిర్మించుకున్న గదిలో గడపాలి. ఆ గది పూర్తిగా సురక్షితమైంది. ఎలాంటి దిగులుకీ, విచారానికీ తావు లేదు. అది మీ మనో ప్రపంచంలోని ప్రశాంత మందిరం. ఆ గదిలోకి ఎవరూ జొరబడలేరు. ఏ జాడ్యాన్నీ దాని దరిదాపుల్లోకి చేరనివ్వరు.

ఒక ఇంటిని నిర్మించేప్పుడు మీ కోసం ప్రత్యేకంగా ఒక గదిని నిర్మించుకుంటారు. అక్కడా ఏకాంతంలో ప్రశాంతంగా గడపాలనుకుంటారు. మీ మనసు మెచ్చినట్టు దాన్ని నిర్మించుకుంటారు. అలాగే ప్రశాంత చిత్తాన్ని సాధించాలనుకునేవారు మీ మనసున మీదయిన గదిని నిర్మించుకోవాలి. ఎలాంటి ఒత్తిళ్ళు, ఆందోళనలు, విచారాలు లేకుండా గడపటానికి అది అనువైన ప్రదేశం. అది ఓ రకంగా ధ్యానస్థితిలోకి వెళ్ళడం. మానసిక బలాన్ని ఇనుమడింపజేసే ప్రక్రియ. ఆందోళనా రహిత మానసాన్ని సంతరించుకోడానికి తోడ్పడే రీతి, జీవనోత్సాహాన్ని ప్రోది చేసే సంవిధానం. ఇలా మీ కోసం మీరు కొంత సమయం కేటాయించుకొని ఆత్మలోకంలో విహరించడం మొత్తం జీవితానికి ఓ గొప్ప ఉద్దీపన!

వెంటాడే వాక్యం
జీవితచరిత్ర ప్రపంచంలోని అన్ని పుస్తకాల కంటే విలువైన గ్రంథం. ఉత్తమ ప్రయోజనకరమైన పఠనానికి అది ఆదర్శం. - కార్లయిల్

ప్రజాశక్తి
సోపతి
అక్టోబర్ 19, 2014

లేఖలు 4
చిట్కాలు
ఆరోగ్యానికి ఆనందం యాపిల్ 5
కవర్‌స్టోరీ
వినూత్న సృజనకు నోబెల్ 6
స్ఫూర్తినిచ్చిన గురువు 9
సంగీతం ఆ పాటలు దీపకళికలు 11
అనువాద కథ పులుసురాయి 12
సమస్యలను ఎదుర్కోవాలా? తప్పుకోవాలా? 13
నెమలీక 14
సీరియల్ ప్రేమ - విప్లవం 16
అలనాటి పత్రిక
మగువలు నడిపిన తెలంగాణ పత్రిక 18
స్ఫూర్తినిచ్చిన గురువు ఆ నలుగురు 19
ఎరుక ఆయుష్షుని పెంచే నిద్ర! 20
స్పందన చిత్రకళా మాలిక 21
నవరాగం
అనురాగపు హస్తమే ప్రేమ 22
సోర్స్‌కోడ్ క్లౌడ్ 3జి పాయే... 4జి వచ్చే... 5జి మిగిలిపాయే.... 23
సమీక్షలు
సరళమైన భాషలో బాల సాహిత్యం 24
ఈ వారం కవిత్వం
బోటనీ 26



నోబెల్ బహుమతుల ప్రక్రియ మొదలయి వందేళ్ళు దాటింది. తాజాగా 2014 సంవత్సరానికి నోబెల్ బహుమతులు ప్రకటించారు. ఈ క్రమాన నూతన ఆవిష్కరణలకు మూలమైన నోబెల్ అవార్డుల కథపై ముఖచిత్ర కథనమిది.

లేఖలు



స్ఫూర్తినిచ్చిన కథనం

నిజాం రాచరికపాలనపై తిరగబడ్డ గోండు గిరిజన నాయకుడు కొమురం భీం గురించి ఆదివారం సోపతిలో చదివి చాలా విషయాలు తెలుసుకున్నాం. ముఖ్యంగా జల్, జంగల్, జమీన్ నినాదంతో సాగిన ఆయన పోరాటం, అధిపత్య ధోరణిని తీవ్రంగా ప్రతిఘటించడం ఎంతో స్ఫూర్తినిచ్చింది.

- సురేఖ, మరికల్, మహబూబ్‌నగర్

కొంత సమయం నిజంగానే ఉండాలి

ఆదివారం సోపతిలో ' కొంత సమయం ఉండాలి ' శీర్షికన వచ్చిన కథనం చాలా బాగుంది. ఉరుకులూ పరుగుల జీవితంలో ఎన్నో సమస్యలు, ఇబ్బందులు మానసిక ప్రశాంతతను దెబ్బతీస్తున్నాయి. ఇలాంటప్పుడు వ్యక్తికి ఏకాంత సమయం అవసరం గురించి రచయిత చెప్పడం బాగుంది. అది చదివాక నిజంగానే కొంత సమయం ఉంటే బాగుంటుందనిపించింది.

- కావ్య, హైదరాబాద్

హాస్యం పాటలు బాగున్నాయి

అక్టోబర్ 5న ప్రజాశక్తి ఆదివారం సోపతిలో వచ్చిన 'హాస్య వల్లరుల గీత మాలిక' శీర్షికన వచ్చిన కథనం చాలా బాగుంది. ప్రతివారమూ వివిధ పాటలకు సంబంధించి ఇవ్వడం చాలా బాగుంది. ఈవారం హాస్య పాటల గురించి చాలా విషయాలు తెలుసుకోగలిగాం.

- రాఘవులు, కన్మన్‌కాల్వ, రంగారెడ్డిజిల్లా

ప్రేమ విప్లవం సీరియల్ అద్భుతం

ఆదివారం సోపతిలో వస్తున్న ప్రేమ-విప్లవం సీరియల్ చాలా బాగుంటోంది. సమాజం, మానవ విలువలు, మానవ సంబంధాలు వంటి అంశాల ప్రాధాన్యం తెలియజేసే ఈ సీరియల్ మాకు భలే నచ్చింది.

- రాజేశ్వర్‌గౌడ్, తలకొండపల్లి, మహబూబ్‌నగర్

మనసును హత్తుకున్న ఉత్తరం

ఆదివారం సోపతిలో వచ్చిన ఉత్తరం రాసి ఎన్నాళ్లయిందో కథనం మనసును హత్తుకున్నట్టుగా ఉంది. అది చదువుతుంటే చిన్నప్పుడు మా ఇంటికి వచ్చే ఉత్తరాలు, వాటికి రాసే బదులు ఉత్తరాలు అదో అనుభూతిని కలిగించే అంశం. మారిన కాలంలో ఉత్తరాల ప్రాధాన్యం తగ్గినా, అవి మనసును హత్తుకున్న జ్ఞాపకాలు మాత్రం సజీవంగా ఉన్నట్లు అనిపించింది.

- స్వరూపాదేవి, సంగారెడ్డి, మెదక్ జిల్లా

మరుగున పడిన జ్ఞాపకం

ఉత్తరాలు రాయడమనే జీవన వ్యాపకానికి మారిన పరిస్థితుల ద్వారా వెల్లువెత్తిన సాంకేతిక పరిజ్ఞానం తాకిడికి అడ్డుకట్ట వేయొచ్చు. కానీ ఉత్తరం అందుకోవడం ద్వారా కలిసే ఆత్మీయ స్పర్శ ఎన్ని ఈ మెయిళ్ల తరతరాలు అందుకున్నా మునుపటి గుండె తడి రాదు. అందుకే మరుగున పడిన జీవన వ్యాపకం మళ్లీ మొలకెత్తి తీరుతుందని నమ్మకం.

- వి.వి. శంకర్, సికింద్రాబాద్

నటనకు జీవం

అలనాటి నటి కన్నాంబ గురించి తెలియని ఎన్నో విషయాలు అందించారు. ఎటువంటి శిక్షణా లేకుండా ఒకేసారి స్టేజి మీద నటించి వందల మంది ప్రేక్షకులను మెప్పించగలిగారంటే ఆమె ఎంత బాగా నటించేవారో అర్థమవుతోంది. ఇప్పటి తరానికి అస్సలు తెలియని ఈ నటీమణి గురించి ఈ శీర్షిక ద్వారా తెలియజేసినందుకు అభినందనలు. భార్యాభర్తల మధ్య అనుబంధం, అనురాగం ఎలా ఉండాలో తెలియజేస్తున్న నవరాగం శీర్షిక బాగుంటోంది. మారుతున్న పరిస్థితులను బట్టి ఆలుమగల ఆలోచనా పద్ధతులు కూడా మారుతున్నాయి. **- రిజ్వానా, హైదరాబాద్**

మన జాతీయాలు

పోయిలుప్ప పోసుకున్నట్లు

మండుతున్న పొయిలో ఉప్పు వేస్తే చిటపటలాడుతుంది. గుప్తవైరం కాదు. బాహాటంగానే చెడామడా మొగమెదురుగా తిట్టుకోవటం. చిటపటలాడటం, ధుమధుమలాడటం. ముఖ్యంగా ఇంట్లో పాలివానివైరం, అత్తాకోడళ్ళ వైరం. ఏరాళ్ళ వైరంకు అంతముండదు. అందరూ ఒక దగ్గర వున్నందున అడుగడుగునా శత్రుదృష్టితో చూడటం వల్ల అనుమానాస్పద పరిస్థితులు తలెత్తి ఒకరినొకరు నిందించుకొని పీడ వదిలించుకో చూస్తారు. "వాళ్లింట్లెప్పుడూ పొయిలుప్పు పోసుకున్నట్లు కొట్లాట. మనసున పట్టది" అనటంలో ఈ జాతీయం వాడకం వుంది.

కాట్లె కొర్రాయి తీరు

కాడు కాలిన తర్వాత కొన్ని కొరుకులు మిగిలిపోతాయి. కాలలేక మిగిలిన కొర్రాయిలు, పూర్తిగా కాలక పొగచూరి నల్లగా అవుతాయి. తెల్లారి మళ్లీ ఈ కొర్రాయిలన ఏరి కాటిలో వేసి పోతారు. దీన్నే కాడసదురుట అంటారు. కాకి నలుపుగా వున్న ఈ కొర్రాయినే కాట్లె కొర్రాయంటారు. జీడితుల్లాగా అనే ప్రయోగం వుంది. కొన్నిరకాల నలుపు ఆకర్షణీయంగా వుంటుంది. మరీ నలుపుగా, అందవికారంగా వుండటం వేరు. "వాని మొకం కాల - కాట్లె కొర్రాయి తీరు వున్నాడు. వానికీ షోకులే" అనటంలో ఈ జాతీయం ప్రయోగం చూడొచ్చు.

టేకుల్ల వాన

టేకు చెట్లు గరుకైన ఆకులు కలిగి వుంటుంది. అవి పచ్చివిగా ఉన్నప్పుడు విస్తళ్ళుగా కూడా వాడతారు. వాన కురిసినపుడు ఆకు పెద్దగా, దట్టంగా, గరుకుగా వున్న కారణం చేత కొద్ది చినుకులు కురిసినా గొప్ప వానలాగా భ్రమ కలిగిస్తుంది. వాన వెలిసిన తర్వాత కూడా ఒక ఆకు మీద ఆగిన బిందువులు మరొకదానిపై రాలటం వల్ల ఇంకా వాన కురుస్తూనే వుందన్న భ్రమ కలుగుతుంది. ఆర్భాటం పెద్దగా ఫలితం అల్పంగా వుండటం అన్నమాట. "నేను రాత్రి ఉరుములు, మెరుపులు చూసి వాన బాగానే కురిసిందనుకున్న. కాని అదంతా టేకుమల్ల వాన తీరే, నేల కూడా నానలేదు" అనడంలో ఈ జాతీయం ఉపయోగిస్తారు.

- వేముల పెరుమాళ్ళు

■ **చిట్కాలు**

ఆరోగ్యానికి ఆనందం యాపిల్

రోజూ ఓ యాపిల్ తింటే డాక్టర్‌తో పనిలేదు. ఉప్మా, ఇడ్లీ, పూరీ, వడ, చపాతీ, పిజ్జా, బర్గర్, బిర్యానీ... ఇవి తిని ఆరోగ్యానికి తూట్లు పొడుచుకునే బదులు రోజూ ఓ యాపిల్ తింటే ఆరోగ్యానికి ఎంత మంచిదో ఆలోచించండి. ముందు మనం చెప్పుకున్న ఆహార పదార్థాల కంటే యాపిల్ ఖరీదు ఎక్కువేం కాదు. ఆరోగ్యానికి హాని చేసే చెత్త తిండి, ఆయిల్ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తినేకంటే రోజుకొక్క యాపిల్ తింటే ఎంతో ఉపయోగం. మంచి శక్తినిచ్చే ఆహారం యాపిల్. నీరసంగా ఉన్నప్పుడు, బాగా కష్టపడి పని చేయాల్సి వచ్చినప్పుడు ఒక్క యాపిల్ తింటే చాలు.. తెలీకుండానే ఉల్లాసం వచ్చేస్తుంది. యాపిల్ తినడం వల్ల దంతాలపై గార తొలగిపోయి తళతళలాడతాయి. ఇందులో ఉన్న విటమిన్ సి శరీరంలోని ఇమ్యూనిటీని పెంచుతుంది. అధిక బరువును అరికడుతుంది. కొన్ని రకాల క్యాన్సర్ వ్యాధుల బారిన పడకుండా కాపాడుతుంది. రోజూ యాపిల్ తింటే బ్లెడ్ షుగర్, డయాబిటీస్, ఆస్తమా వ్యాధిగ్రస్తులకు ఎంతో మేలు చేస్తుందీ యాపిల్.

లవంగంతో లాభాలెన్నో...

పంటి నొప్పిని లవంగం తగ్గిస్తుందన్నది జగమెరిగిన సత్యం.

→ కడుపులో తిప్పినట్లున్నప్పుడు ఓ లవంగం మొగ్గ బుగ్గన పెట్టుకుంటే తగ్గిపోతుంది.

→ దగ్గు వచ్చినప్పుడు లవంగాన్ని కాల్చి, దాన్ని నమిలి బుగ్గన పెట్టుకుంటే ఉపశమనం లభిస్తుంది.

→ అపాన వాయువు బాగా పోతుందా? లవంగం పొడిని తేనెలో గానీ పాలలో గానీ కలుపుకుని రోజూ తాగితే, కొద్ది రోజులకు ఈ సమస్య తగ్గుతుంది.

→ గోరు వెచ్చని నీటిలో పది చుక్కలు లవంగం నూనె, ఒక స్పూన్ తేనె వేసుకుని తాగితే జలుబు తగ్గుతుంది.

→ లవంగం పొడిలో తులసి ఆకుల పొడి, పొదీనా ఆకుల పొడి, యాలకుల పొడి, తేనె కలిపి ముద్ద చేస దాన్ని నోట్లో పెట్టుకుంటే ఒత్తిడి తగ్గుతుంది.

పుదీనాతో ఆరోగ్యం పదిలం

→ చర్మ వ్యాధులున్నవారు పుదీనా రసంతో చర్మాన్ని రుద్దితే సత్ఫలితాలను పొందొచ్చు.

→ రోజూ ఐదారు పుదీనా ఆకుల్ని నమిలి మింగితే నోటి దుర్వాసనకు కారణమైన బ్యాక్టీరియా నశిస్తుంది. చిగుళ్ల వ్యాధులు దరి చేరవు. ఒకవేళ ఉంటే క్రమంగా నెమ్మదిస్తాయి.

→ దంత క్షయం తగ్గుతుంది.

→ పుదీనా ఆకులు తింటే గొంతు నొప్పి, దగ్గుల నుండి ఉపశమనం లభిస్తుంది.

→ నీళ్ళ విరోచనాలు ఉన్నవారు పావు కప్పు పుదీనా రసంలో ఒక స్పూన్ తేనె వేసుకుని ఉదయం, సాయంత్రం తాగితే విరోచనాలు తగ్గుముఖం పడతాయి.

→ పుదీనా రసంలో నిమ్మరసం, తేనె కలిపి రోజూ తీసుకుంటే జీర్ణసంబంధమైన అనేక ఇబ్బందులు అదుపులోకి వస్తాయి.

- బి.భాస్కర్, 9553937529

■ కవర్ స్టోరీ

వినూత్న సృజనకు నోబెల్

ఒక వార్త...

ఆయన జీవితాన్ని మార్చేసింది.

అదే పరిశోధనల తీరునూ, ప్రపంచ గమనాన్నీ మలుపు తిప్పింది.

★★★

అనగనగా ఒక దేశం.. దాని పేరు.. స్వీడన్..

అందులో ఒక ఊరు... స్టాక్‌హోమ్..

ఆ ఊరిలో ఒకాయన...

ఆయనకు చిన్ననాటి నుంచీ పరిశోధనలు చేయడం పట్లా, కొత్త వాటిని కనుక్కోవడం పట్లా ఆసక్తి ఉండేది. దానితో ఆయన డైనమైట్ అనే పేలుడు పదార్థాన్ని కనుగొన్నాడు. దానితో వ్యాపారం మొదలుపెట్టాడు. అంతులేని సంపద ఆర్జించాడు. ఆ దేశపు ధనవంతుల్లో ఒకరుగా పేరుపొందాడు.

ఒక రోజు ఆయన తమ్ముడు చనిపోయాడు. దానితో ఒక పత్రిక ఈయనే కన్నుమూశాడనుకుని 'మృత్యువ్యాపారి మరణం' అనే శీర్షిక పెట్టి 'ఎంతో మందిని చంపడం ద్వారా అంతులేని సంపదను ఆర్జించిన పెద్దమనిషి మృతిచెందాడు' అంటూ పొరపాటున ఒక వార్తను ప్రచురించింది.

ఇది చదివిన ఆయన చాలా బాధపడ్డాడు. తాను చనిపోయాక చరిత్ర తనను ఇంత దుర్మార్గుడిగా గుర్తిస్తుందా? అనుకుని మనోవేదన చెందాడు. తనను ప్రపంచం ఎప్పటికీ మంచివాడుగా గుర్తించాలని తపనపడ్డాడు. ఏం చేస్తే భవిష్యత్ తరాలు తనను సజ్జనుడిగా చెప్పుకుంటారు? అని ఆలోచించాడు. హితులు, సన్నిహితులతో చర్చించాడు. ఒక స్నేహితురాలు ఇచ్చిన సలహా నచ్చింది. ఆమె సూచించినట్లుగానే తన పేరిట విశేషమైన బహుమతులు ఇవ్వాలని నిశ్చయించాడు. అవి 'నభూతో నభవిష్యతి' అన్నట్లుగా ఉండాలని తలంచాడు. తన యావదాస్తినీ అందుకు రాసిచ్చాడు. ప్రజాభ్యున్నతికి, ప్రపంచ శాంతికి కృషి చేసిన వారికీ, మానవాళికి మహోపకారం చేసే ఆవిష్కరణలు చేసిన వారికీ, వినూత్న సృజనకు ప్రతి ఏటా తన పేరిట బహుమతులనివ్వాలని వీలునామా రాశాడు.

ఆయనే ఆల్ఫ్రెడ్ బెర్న్‌హార్డ్ నోబెల్.

ఆ బహుమతి పేరే నోబెల్ అవార్డు.

ఆయన వ్యక్తిత్వమూ, ఆయన ప్రారంభించిన అవార్డుల కథే ఈ వారం కవర్ స్టోరీ...

- ఎన్.మదనయ్య

స్టాక్‌హోంలోని పరిశోధకుల వంశమైన నోబెల్స్ కుటుంబంలో 1833 అక్టోబర్ 21న అల్ఫ్రెడ్ జన్మించాడు. తండ్రి ఇమ్మాన్యుయేల్ నోబెల్ వృత్తిరీత్యా ఇంజనీర్. తల్లి కరోలినా ఆండ్రియెట్టే గృహిణి. ఈ దంపతులకు ఎనిమిది మంది సంతానం. అయితే నలుగురు పిల్లలు మాత్రమే బాల్యం దాటి బతకగలిగారు. అందులో ఒకరు మన నోబెల్. శాస్త్రవేత్తల వంశమైనందున ఆల్ఫ్రెడ్ చిన్ననాటి నుంచే పరిశోధనల పట్ల ఆసక్తి చూపేవాడు. మరీ ముఖ్యంగా పేలుడు పదార్థాల గురించిన అధ్యయనమంటే అత్యంత ఇష్టం.

అల్ఫ్రెడ్‌కు బడికి వెళ్లే వయస్సు రాకముందే తండ్రి వ్యాపారంలో నష్టం రావడంతో సెయింట్ పీటర్స్‌బర్గ్‌కు మకాం మార్చాడు. అక్కడ యంత్ర పరికరాలు, పేలుడు పదార్థాల తయారీ వ్యాపారం మొదలుపెట్టిన ఇమ్మాన్యుయేల్ నోబెల్ ప్రవృత్తి రీత్యా పరిశోధనలు చేస్తూ ప్లైవుడ్‌ను కనుగొన్నాడు. బిజినెస్, రీసెర్చ్.. రెండిటిలోనూ సక్సెస్ సాధించడంతో అనతి కాలంలోనే బాగా ధనం సమకూరింది.

కుటుంబం ఆర్థికంగా పుంజుకోవడంతో ఆల్ఫ్రెడ్‌కు చదువుకునే అవకాశం చిక్కింది. దానితో ఆయన కెమిస్ట్రీ, లాంగ్వేజెస్ సబ్జెక్టులతో చదువులు కొనసాగించాడు. ఇంగ్లీషు, ఫ్రెంచ్, జర్మన్, రష్యా భాషల్లో ప్రావీణ్యం సంపాదించాడు. ఉన్నత చదువుల కోసం ఆల్ఫ్రెడ్ తన 18వ ఏట అమెరికాకు వెళ్లాడు. అక్కడ కెమిస్ట్రీలో పరిశోధక విద్యార్థిగా ఉంటూనే 1857లో గ్యాస్ మీటర్‌ను కనుగొన్నాడు. దీనితోనే యువ ఆల్ఫ్రెడ్ తన పేరిట మొదటి పేటెంట్‌ను పొందాడు. అదే కోవలో పరిశోధనలు చేసి 1863లో డిటొనేటర్ కనుగొన్నాడు. ఈ పేలుడు పదార్థ తయారీ పరిశ్రమను ప్రారంభించాడు. 1865లో బ్లాస్టింగ్ క్యాప్‌ను రూపొందించాడు. 1864 సెప్టెంబర్ నెలలో ఆల్ఫ్రెడ్ కంపెనీ నైట్రోగ్లిజరిన్ పేలుడు కారణంగా కాలిపోయింది. అల్ఫ్రెడ్ తమ్ముడితో పాటు అందులో అయిదుగురు దుర్మరణం పాలయ్యారు. దీన్ని ఒక గుణపాఠంగా తీసుకున్న బెర్న్‌హార్డ్ 'మంచి క్వాలిటీ' ఉన్న పేలుడు పదార్థాన్ని తయారు చేయాలనుకున్నాడు. ఈ ప్రయత్నంలో భాగంగా 1867లో డైనమైట్‌ను కనుగొన్నాడు. అటు తరువాత 1875లో డైనమైట్ కన్నా శక్తిమంతమైన జెలిగ్నైట్‌ను కనుగొన్నాడు. ఇవే కాదు పరిశోధకుడిగా ఆల్ఫ్రెడ్ తన పేరిట మొత్తం 355 పేటెంట్‌లను పొందాడు. మరోపక్క బిజినెస్‌నూ కొనసాగించాడు. బోఫోర్స్ ఉక్కు కర్మాగారాన్ని కొని దానిని ఆయుధ తయారీ కేంద్రంగా

మార్చాడు. (అవినీతి, కుంభకోణం కారణంగా మనకు సుపరిచితమైన బోఫోర్స్ ఇదే) ఇలా ఒక పక్క పరిశోధకుడిగానూ, మరో పక్క వ్యాపారవేత్తగానూ అంతులేని సంపదను ఆర్జించాడు నోబెల్. వినాశకర ఆయుధాల తయారీ, వ్యాపారాలతో సంపాదనలో ముందుకు దూసుకుపోతున్న ఆల్ఫ్రెడ్ జీవితాన్ని 1888లో ప్రచురితమైన 'మృత్యు వ్యాపారి మరణం' వార్త మలుపు తిప్పింది. ఆయనను శాంతి దూతగా మార్చింది. మనుషుల గురంచీ, సమాజం గురించి, ప్రపంచం గురించీ... దాని మంచిచెడ్డల గురించీ ఆలోచింపజేసింది. ఆ ఆలోచనల్లోంచి రూపొందినవే నోబెల్ అవార్డులు.

వాటికోసమే 1895 నవంబర్ 27న తన యావదాస్తినీ ధారపోశాడు. మానవాళికి మహోపకారం చేసే ఆవిష్కరణలు చేసిన వారిని సత్కరించడం కోసం సంపదనంతా కేటాయించాడు. ఈ ధనంతో భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం, వైద్యం, శాంతి, సాహిత్య రంగాల్లో కృషి చేసిన వారికి ప్రపంచ స్థాయి బహుమతులనివ్వాలని వీలునామా రాశాడు. అయితే ఆ బహుమతులను ప్రారంభించకుండానే 1896 డిసెంబర్ 10న కన్ను మూశాడు అల్ఫ్రెడ్ బెర్నహార్డ్ నోబెల్. అనంతరం ఈ ధన పరిరక్షణ కోసం స్వీడన్ ప్రభుత్వ నేతృత్వంలో నోబెల్ ఫౌండేషన్ స్థాపితమైంది. ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలోనే అవార్డుల ఎంపిక కోసం అయిదు కమిటీలు ఏర్పాటైనాయి.

1901 నుంచీ అయిదు రంగాల్లో అవార్డుల పురస్కారం ప్రారంభమైంది. 1968 నుంచీ ఆర్థిక రంగంలోనూ అత్యున్నత కృషి చేసిన వారికి అవార్డునిస్తున్నారు. దానితో బహుమతి ఆరు రంగాలకు విస్తరించింది. 114 సంవత్సరాల నుంచీ ప్రతి ఏటా క్రమం తప్పకుండా పురస్కరిస్తూ వస్తోన్న ఈ బహుమతిని నేటి వరకు 847 మంది ప్రముఖులతో పాటు, 22 సంస్థలు అందుకున్నాయి. ఈ ఏటితో కలుపుకుంటే నోబెల్ అవార్డులు పొందిన వారి సంఖ్య 860కి పెరుగుతుంది.

ఈ ఏటి నోబెల్ విజేతలు

మస్తిత్వ దిక్సూచికి వైద్యశాస్త్ర బహుమతి

మెదడులో దిశానిర్దేశం జరిగే తీరును ఆవిష్కరించిన బ్రిటన్ – అమెరికన్ జాన్ ఒ కీఫె, నార్వేకు చెందిన భార్యాభర్తలు ఎడ్వర్డ్ మోసర్, మే బ్రిట్ మోసర్‌లు ఈ ఏటి మెడిసిన్ నోబెల్ బహుమతికి ఎంపికయ్యారు. మనో స్థితిని తెలుసుకోవడానికి ఉపకరించే వ్యవస్థ అంతర్గత జిపిఎస్‌ను వీరు కనుగొన్నారు. ఆల్జీమర్స్, మెదడుకు సంబంధించిన ఇతర వ్యాధులకు చికిత్స చేయడానికి వీరి పరిశోధన దోహదపడుతుంది. 'మనిషి చుట్టూ ఉన్న ప్రదేశానికి సంబంధించిన మ్యాప్‌ను మెదడు ఎలా తయారు చేసుకుంటుంది, దిశానిర్దేశాన్ని ఎలా చేస్తుంది? అనే ప్రశ్నలు, తరతరాలుగా తత్వవేత్తలు, శాస్త్రవేత్తల మెదడును తొలిచేస్తున్నాయి. వీరి పరిశోధన జవాబులు చెప్పింది'అని అవార్డు ఎంపిక కమిటీ వీరి ఆవిష్కరణలను ప్రశంసించింది. మెదడులో మార్గనిర్దేశక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడానికి వీలు కల్పించే సమన్వయ వ్యవస్థను రూపొందించే నాడీ(గ్రిడ్) కణాలను కూడా వీరు గుర్తించారు. ఈ బహుమతికింద వీరికి 11 లక్షల డాలర్లు నగదు పురస్కరిస్తారు. దీనిలో సగం సొమ్ము జాన్ కీఫెకు పోగా, మిగతా సగం ఈ జంటకు దక్కుతుంది. గత ఏడాది ఈ వైద్య శాస్త్ర బహుమతిని కణంలో రవాణా వ్యవస్థ నియంత్రణ పద్ధతులను కనుగొన్నందుకు గానూ జేమ్స్ ఇ రోత్‌మాన్, రాండీ షెక్‌మాన్, థామస్ సుధాఫ్‌లు అందుకున్నారు.

ఎల్ఇడి ఆవిష్కరణకు ఫిజిక్స్ అవార్డు

పర్యావరణానికి మేలు చేసే, ఇంధనాన్ని ఆదా చేసే తెల్లని వెలుగునిచ్చే నీలిరంగు లైట్ ఎమిటింగ్ డయోడ్ (ఎల్ఇడి) ఆవిష్కరణకు భౌతిక శాస్త్రంలో ఈ



ఏడాది ముగ్గురిని నోబెల్ బహుమతి వరించింది. జపాన్‌కు చెందిన శాస్త్రవేత్తలు ఇసాము అకసాకి, హిరోషి అమనో, అమెరికన్ సైంటిస్టు షుజి నకమురా సంయుక్తంగా ఈ అవార్డును దక్కించుకున్నారు. ఈ ఆవిష్కరణ ఇల్యూమినేషన్ టెక్నాలజీ రంగంలో విప్లవం తీసుకువచ్చిందనిరాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ పేర్కొంది. అల్ఫ్రెడ్ గనుక నేడు బతికి వుంటే ఈ ఆవిష్కరణకు ఎంతో సంతోషపడేవారని కమిటీ వ్యాఖ్యానించింది. ఫ్లోరోసెంట్ దీపాల్లో పాదరసం వుంటుంది. కానీ ఎల్ఇడిల్లో అది వుండదు. భవిష్యత్తులో, దీన్ని నీటిని స్టెరిలైజ్ చేయడానికి కూడా వాడుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా గల విద్యుత్‌లో నాలుగోవంతు విద్యుత్‌ను మనం కేవలం వెలుతురు కోసమే ఉపయోగిస్తున్నాము. ఇప్పుడు ఎల్ఇడి ఆవిష్కరణతో భూమిపై గల ఇంధన వనరులను ఆదా చేయడానికి చాలా వీలువుంటుంది. నీలి ఎల్ఇడిని ఉపయోగించి తెల్లని లైట్‌ను కూడా సృష్టించి మానవాళికి ఎంతో మేలు కలుగజేయవచ్చు. సబ్ అటామిక్ పార్టికల్ ద్రవ్యరాశిని సమగ్రంగా అర్థం చేయించే పద్ధతిని కనుగొన్నందుకుగానూ గత ఏడాది ఈ బహుమతి ఫ్రాంకోయిస్ ఎంగ్లర్ట్, పీటర్ డబ్ల్యు. హిగ్స్‌లు అందుకున్నారు.

నానోస్కోప్ ఆవిష్కరణకు కెమిస్ట్రీ అవార్డు

సూక్ష్మదర్శిని (మైక్రోస్కోప్) దృష్టి తీవ్రతను అభివృద్ధి పరచి అత్యంత సూక్ష్మాతి సూక్ష్మమైన వివరాలను కూడా పసిగట్టే విధంగా (నానోస్కోప్) తీర్చిదిద్దిన ముగ్గురు శాస్త్రవేత్తలకు రసాయనిక శాస్త్రంలో పురస్కారం లభించింది. అమెరికాకు చెందిన ఎరిక్ బెట్జిక్, విలియం మోర్నర్‌తో పాటు జర్మనీ శాస్త్రవేత్త స్టెఫాన్ హెల్ అవార్డును పొందారు. సూక్ష్మదర్శిని దృష్టి తీవ్రతను అత్యంత నిశితంగామార్చటం ద్వారా సంప్రదాయ సూక్ష్మదర్శినులను సూక్ష్మాతి సూక్ష్మవివరాలను కూడా పసిగట్టే విధంగా రూపొందించారని అవార్డును ప్రకటించిన రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రశంసించింది. 54 ఏళ్ల బెట్జిక్ వర్జీనియాలోని ఆష్‌బర్న్‌లో వున్నహొవార్డ్ హ్యూస్ మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేస్తున్నారు. 51 సంవత్సరాల హెల్ జర్మనీలోని మ్యాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ బయో ఫిజికల్ కెమిస్ట్రీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇక ఈ శాస్త్రవేత్తల త్రయంలో మూడో వ్యక్తి 61 ఏళ్ల మోర్నర్ (61) కాలిఫోర్నియాలోని స్టార్‌ఫోర్డ్ యూనివర్శిటీలోప్రొఫెసర్‌గా

వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం శాస్త్ర పరిశోధనల్లో వినియోగిస్తున్న ఆప్టికల్ మైక్రోస్కోప్‌లో కాంతి తరంగదైర్ఘ్యం వంటి కొన్ని పరిమితులకు లోబడి పనిచేస్తున్నాయి. ఈ కారణంగా వీటి నుండి 0.2 మైక్రోమీటర్ల కన్నా సూక్ష్మ దార్శనికతను పొందలేం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అందుబాటులోకి వచ్చిన ఫ్లోరోసెంట్ మాలిక్యూల్స్ సాయంతో ఈ ముగ్గురూ ఆప్టికల్ మైక్రోస్కోప్‌కు వున్న పరిమితుల చట్రాన్ని ఛేదించి జీవకణంలోని అతి చిన్న భాగాలను కూడా చూడగలిగే మైక్రోస్కోప్ (నానోస్కోప్) ఆవిష్కరణకు మార్గం సుగమం చేశారు. మిశ్రమ రసాయన వ్యవస్థలకు సంబంధించిన బహుళార్థక మోడల్స్‌ను అభివృద్ధి చేసిన మార్టిన్ కార్‌ప్లస్, మైఖేల్ లెవిట్, ఎరిక్ వార్షెల్ గత సంవత్సరం ఈ బహుమతిని పొందారు.

యూదుల బాధల గాథలకు సాహిత్య నోబెల్

69 సంవత్సరాల ఫ్రెంచ్ రచయిత, నవలాకారుడు పాట్రిక్ మోడియానో సాహిత్య అవార్డుకు ఎంపికయ్యారు. ఫ్రాన్స్‌లో అందరికీ సుపరిచితుడైన మోడియానో కొన్ని ఇతరదేశాలలో సైతం తన రచనలకు అభిమానులను సంపాదించుకున్నారు. రెండవ ప్రపంచ యుద్ధం, ఆతరువాతి సమయంలో యూదులు, నాజీల ఘర్షణల కారణంగా ఫ్రాన్సులో సామాన్యుల జీవితాల్లో వచ్చిన మార్పుల గురించే ఈయన ఎక్కువ రచనలు చేశారు. ప్రధానంగా యూదుల బాధలను తన రచనల్లో ప్రస్తావించేవారు. చిన్నపిల్లల పుస్తకాలు, సినిమా స్క్రిప్టులు, నవలలు రాసిన ఆయన రచనల్లో ప్రసిద్ధమైనది 'మిస్సింగ్ పర్సన్'. ఒక డిటెక్టివ్ తన జ్ఞాపకశక్తిని కోల్పోతే జరిగే పరిణామాలపై రాసిన ఈ నవలకు 1978లో ప్రతిష్ఠాత్మకమైన ప్రిక్స్ గాన్‌కోర్ట్ పురస్కారం లభించింది.

1945లో రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన రెండు నెలల తరువాత పారిస్ నగర పశ్చిమ శివార్లలోని ఒక ప్రాంతంలో మోడియానో జన్మించారు. ఆయన తండ్రి ఇటలీ సంతతి యూదు వ్యక్తి కాగా తల్లి బెల్జియన్ నటి. ఆయన పారిస్‌లో నివసించిన సమయంలో తన రచనా వ్యాసంగాన్ని ప్రారంభించారు. ఈ పురస్కారంతో ఆయనకు 80 లక్షల క్రోనార్లు (11 లక్షల డాలర్లు) నగదు బహుమతి లభిస్తుంది.

బాలల భవిష్య దాతలకు శాంతి బహుమతి

బాలల హక్కుల కోసం కృషి చేస్తున్న భారతీయుడు కైలాష్ సత్యార్థి, బాలికల అక్షరాస్యత కోసం పోరాడుతున్న పాకిస్తాన్ బాలిక మలాలా యూసఫ్‌జాయ్‌లు సంయుక్తంగా ఈ ఏటి నోబెల్ శాంతి బహుమతికి ఎంపికయ్యారు.

మధ్యప్రదేశ్‌లోని విదిశకు చెందిన కైలాష్ కైలాష్ సత్యార్థి 'బచ్‌పన్ బచావో ఆందోళన్' పేరిట రెండున్నర దశాబ్దాలుగా కృషి చేస్తున్నారు. బాలకార్మికులుగా పని చేస్తున్న దాదాపు 80 వేల మంది బాలలకు ఆయన విముక్తి కల్పించారు. బాలల కోసం ప్రత్యేకంగా బాలమిత్రగ్రామ్ అనే కార్యక్రమం ప్రారంభం కోసం ఈయన కూడా కృషి చేశారు. ఇంజనీరింగ్ చదివిన ఈయనకు బడిలో చేరిన తొలి నాడు ఎదురైన అనుభవమే బాలల హక్కుల కార్యకర్తగా ఎదిగేలా చేసింది.



నోబెల్ దంపతులు

ఈ ఏడాది వైద్య విభాగంలో అవార్డుకు ఎంపికైన మే-బ్రిట్ మోసర్, ఎడ్వర్డ్ మోసర్ భార్యాభర్తలు. ఈ జంట నోబెల్ బహుమతులు పొందిన దంపతుల జాబితాలో చేరిపోయారు. 114 ఏళ్ల ఈ అవార్డుల చరిత్రలో ఇప్పటి వరకూ అయిదు జంటలు మాత్రమే బహుమతినందుకున్నాయి. వీరిలో నాలుగు జంటలు సంయుక్తంగానూ, ఒక జంట మాత్రం విడివిడిగానూ నోబెల్‌ను అందుకున్నారు. వారే...

1903లో ఫ్రెంచ్ శాస్త్రవేత్త మేరీక్యూరీ, ఆమె భర్త పియరీ క్యూరీలు భౌతిక శాస్త్రంలో అవార్డునందుకున్నారు.

1935లో ఈ తొలి నోబెల్ దంపతుల కుమార్తె ఇరెనె జోలియట్, ఆమె భర్త ఫ్రెడిక్ జోలియట్‌లు రసాయన శాస్త్ర బహుమతిని పొందారు. ఈ ఇరు జంటలనూ కలిపి 'నోబెల్ కుటుంబం'గానూ వ్యవహరిస్తారు.

1947లో అమెరికా-చెక్ దంపతులు గెర్టీ, కార్ల్ కోరి వైద్యశాస్త్రంలో నోబెల్ పొందారు.

1974లో స్వీడన్‌కు చెందిన ఆర్థికవేత్త గున్నార్ మిర్డల్, 1982లో ఆయన భార్య ఆల్వా మిర్డల్ శాంతి పురస్కారాన్ని అందుకున్నారు.

ప్రపంచవ్యాప్తంగా పలు సంస్థలు, ఎన్జీఓలతో కలిసి బాలలకు వెట్టి నుంచి విముక్తి కల్పించడం కోసమూ, వారి హక్కుల కోసమూ ఆయన 144 దేశాలు పర్యటించారు. ఎన్నో కార్యక్రమాలు చేశారు. బాలల కార్యకర్తలకు శిక్షణ కూడా ఇస్తున్నారు. 'గ్లోబల్ మార్చ్ ఎగైనెస్ట్ చైల్డ్ లేబర్'లోనూ ఆయన పాల్గొన్నారు. బాలల హక్కులపై ఆయన ప్రచారాలు, ప్రజలను చైతన్యం చేసే కార్యక్రమాలనూ నిర్వహిస్తున్నారు. 1954లో జన్మించిన సత్యార్థి భోపాల్‌లోని ఇంజనీరింగ్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పని చేశారు. ఈ బాధ్యతల్లో ఉండగానే పేద పిల్లల కోసం బుక్‌బ్యాంక్‌ను ప్రారంభించారు. 1980లో బచ్‌పన్ బచావో ఆందోళన్ సంస్థను ప్రారంభించారు. 2009లో ఐక్యరాజ్యసమితి బాలలకు ఉచిత, నిర్బంధ విద్యాహక్కుకు చట్టబద్ధం కల్పించాలని చేసిన తీర్మానం వెనుక కృషి సత్యార్థిదే. దేశాధినేతలు, ప్రముఖులు సభ్యులుగా ఉన్న యునెస్కో ఎడ్యుకేషన్ ఫర్ ఆల్ కార్యక్రమంలో ప్రస్తుతం ఈయన కూడా సభ్యుడుగా ఉన్నారు. ఈయన చేసిన సేవలకు గానూ దేశవిదేశాల్లో ఎన్నో పురస్కారాలు పొందారు. ఇంత కృషి చేసి, ప్రపంచంలోనే ఉన్నత స్థాయి బాధ్యతలు నిర్వహించినా షరా మామూలుగానే ఈయనను మన ప్రభుత్వం గుర్తించలేదనే చెప్పాలి. నోబెల్ శాంతి బహుమతికి ఈయనను నామినేట్ చేసింది మనం మాత్రం కాదు. యూరోపియన్ పార్లమెంటు ఆ సత్కార్యం నిర్వహించడం కోసమెరుపు.

ఇక ఈ ఏటి శాంతి బహుమతి రెండో విజేత అయిన మలాలా యూసుఫ్‌జాయ్ బాలికల విద్యకోసం ప్రాణాలనే పణంగా పెట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆమె పాకిస్తాన్‌లోని ఛాందస తీవ్రవాదుల తూటాలకు గుర్రై చావు అంచుల వరకూ వెళ్లి వచ్చిన విషయమూ మనం ఎరిగిందే. ఈ 17 ఏళ్ల బాలిక చిన్న నాటి నుంచే బాలికల విద్యా హక్కు కోసం కృషి చేస్తోంది. పాకిస్తాన్‌లోని స్వాత్ జిల్లా మింగోర్‌కు చెందిన మలాలా 12 ఏళ్ల వయస్సులోనే తాలిబాన్ల ఆధీనంలోని తమ జీవితాల గురించి బిబిసికి తన బ్లాగు ద్వారా తెలియజేసింది. అప్పటి నుంచీ తాలిబాన్ల 'టార్గెట్'గా ఉన్నా కూడా వెరవకుండా బాలికల విద్య కోసం కృషి చేసింది. 2012లో చివరకు ఆ ఛాందసులు ఆమెపైకి కాల్పులు జరిపారు. తీవ్రంగా గాయపడిన ఆమె దాదాపు నాలుగు నెలల పాటు ఇంగ్లండ్‌లోని బ్రిమింగ్ హామ్ పట్టణంలోని క్వీన్ ఎలిజబెత్ ఆసుపత్రిలో చికిత్స పొంది ప్రాణాపాయం నుంచి బయటపడింది. ఐరాస సదస్సుపలో అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా ముందు మలాలా బాలికల విద్య, హక్కులపై

ప్రసంగించింది. టైమ్ మేగజైన్ ప్రచురించిన వందమంది అత్యంత ప్రభావవంతమైన వ్యక్తుల జాబితాలో చోటు దక్కించుకుందీ సాహసబాలిక. ఇలా ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రశంసలు, అవార్డులందుకున్న ఈమె గౌరవార్థం ఐరాస మాలాలా డేను కూడా ప్రకటించింది. 'ఐయామ్ మలాలా' అనేది యూసుఫ్‌జాయ్ ఆటోబయోగ్రఫీ. నోబెల్ శాంతి బహుమతిని పొందిన అతి పిన్నవయస్కురాలిగా సరికొత్త రికార్డు సృష్టించింది మలాలా. గత ఏడాది ఈ బహుమతిని ఆర్గనైజేషన్ ఫర్ ద ప్రొహిబిషన్ ఆఫ్ కెమికల్ వెపన్స్ పొందింది.

మార్కెట్ నియంత్రణకు ఆర్థిక అవార్డు

ఫ్రాన్సుకు చెందిన ఆర్థికవేత్త జీన్ టిరోల్‌కు ఈ ఏడాది ఆర్థికశాస్త్ర నోబెల్ పురస్కారం దక్కింది. మార్కెట్ సామర్థ్యం, నియంత్రణపై ('మార్కెట్ పవర్ అండ్ రెగ్యులేషన్')పరిశోధనలకుగాను ఆయనకు ఈ బహుమతి లభించింది. కొన్ని శక్తిమంతమైన సంస్థల పనితీరును పరిశీలించటం ద్వారా మనం పారిశ్రామిక రంగంలోని నియంత్రణలను ఎలా అవగాహన చేసుకోవచ్చో ఆయన పరిశోధనలు తెలియజేస్తాయని అవార్డు కమిటీ వ్యాఖ్యానించింది. 'శక్తిమంతమైన కంపెనీలకు కళ్లెం వేయడం ఎలాగో తెలియజెప్పే ఈయన సిద్ధాంతం ఆధారంగా ప్రభుత్వాలు వాటిని సమయానుకూలంగా నియంత్రించగలుగుతాయి. తద్వారా వాటిని ప్రజాప్రయోజనాలకు పనిచేసే విధంగా చేయవచ్చు.

ఫ్రాన్సులోని టౌలోస్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న టిరోల్ మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి 1981లో డాక్టరేట్ పొందిన నాటి నుంచీ వాణిజ్య సంస్థల నియంత్రణపై పరిశోధనలు కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా బ్యాంకింగు రంగంపై దృష్టి కేంద్రీకరించి పని చేస్తున్నారు. అయితే 2008 ఆర్థిక మాంద్యం అనంతరం ఈయన సిద్ధాంతాలు, సూచనలు, ఆర్థిక విధానాలు బహుళ ప్రచారంలోకి వచ్చాయి. ఆర్థికమాంద్యం పరిశ్రమల నుంచి పుట్టిందికాదని, మార్కెట్ నియంత్రణలో ప్రభుత్వాల వైఫల్యాలే కారణమని ఆయన తెలిపారు. అమెరికా, యూరోపులోని ఆర్థిక సంస్థల నియంత్రణల్లో అనేక లొసుగులను ఎత్తి చూపిన టిరోల్ వాటిని ముందే నియంత్రించి ఉంటే ఆర్థిక మాంద్యం తప్పేదని కూడా తెలిపారు. గుత్తాధిపత్యమే అభివృద్ధికి విఘాతమనీ, ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక శక్తుల పునరేకీకరణ, విస్తరణలతో కొన్ని కంపెనీలు సమాజహితానికి ఏ విధంగా విఘాతంగా ఉన్నాయో..., వాటిపై ప్రభుత్వాల నియంత్రణ ఎంత ఆధ్వాన్నంగా ఉందో అనే విషయాన్ని జీన్ టిరోల్ తన సిద్ధాంతాల ద్వారా స్పష్టంగా తెలియజెప్పారు. కొద్దిపాటి గుత్తాధిపత్య సంస్థలు మార్కెట్‌ను గుప్పిటపట్టి అందులోకి కొత్త సంస్థలు ప్రవేశించకుండా, తమకు పోటీ ఎదురుకాకుండా విచ్చలవిడి వ్యాపారాలకు తెగబడుతున్నారని చెప్పారు. ఆర్థిక అభివృద్ధికంటే సమాజ ఆర్థిక భద్రతే ముఖ్యమని చెప్పడమే ఆయన ప్రజావైఖరిని తెలుపుతోంది. ఈ పురస్కారం కింద ఆయన 1.1 మిలియన్ డాలర్ల నగదు అందుకుంటారు. 1968 నుంచి పురస్కరిస్తున్న నోబెల్ ఆర్థిక బహుమతిని గత ఏడాది ద్రవ్య మార్కెట్ల గమనాలపై పరిశోధన చేసిన యూజీన్ ఎఫ్ ఫామా, రాబర్ట్ జె. షిల్లర్‌లు అందుకున్నారు.

అర్హుల ఎంపిక ఎలా?

ఇంతటి ఘన చరిత్ర గలిగిన నోబెల్ అవార్డులకు అర్హులను ఎంపిక చేయడంలోనూ ప్రత్యేకత ఉంది. ఎంపిక ప్రక్రియ దాదాపు ఏడాదిపాటు కొనసాగుతుంది. అంటే ఈ సంవత్సరం ఇచ్చే అవార్డులకు అర్హులైన వారిని ఎంపిక చేయడం కోసం గత సెప్టెంబర్‌లోనే నామినేషన్లు ఆహ్వానిస్తారు. జనవరి 31 వరకూ ఈ నామినేషన్లను స్వీకరిస్తారు. శాంతి, సాహిత్య రంగాల్లో ఇచ్చే బహుమతులకు సాధారణంగా వ్యక్తుల జీవితకాల కృషిని పరిగణనలోకి తీసుకుంటారు. వైద్య, వైజ్ఞానిక రంగాల్లో అయితే ఆయా పరిశోధనలు, ఆవిష్కరణలు జరిగిన ఏడాదిలో మాత్రమే పరిగణనలోకి తీసుకునే వారు. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో ఇటీవల ఈ నిబంధనను మార్చారు. ప్రస్తుతం ఆయా ఆవిష్కరణలు పూర్తి స్థాయి ఫలితాలు వెల్లడైన సంవత్సరం కానీ లేదా అవి గరిష్టంగా గుర్తింపు పొందిన సంవత్సరాలను గానీ గమనంలోకి తీసుకుంటున్నారు.

సంబంధిత రంగాల్లోని సంస్థలు గానీ, వ్యక్తులు గానీ బహుమతులకు పేర్లను ప్రతిపాదించవచ్చు. అన్ని బహుమతులకూ కలిపి ప్రతీఏటా ప్రపంచం నలుమూలల నుంచీ 3000 వరకూ ప్రతిపాదనలు వస్తాయని అంచనా. నోబెల్ కమిటీలు ఈ దరఖాస్తులను వడపోసి దాదాపు 300 మందిని ఎంపిక చేస్తారు. ఇలా ప్రాథమికంగా ఎంపికైన వారి గురించి, వారు చేసిన కృషి గురించీ వివిధ దశల్లో, రకరకాలుగా పరిశీలనలు జరుపుతారు. శాంతి బహుమతి కోసం నామినేట్ అయిన వారి గురించిన వివరాలు మాత్రం ఆయా దేశాల ప్రభుత్వాల నుంచి తీసుకుంటారు. అంతర్జాతీయ కోర్టు సభ్యులు, గతంలో ఈ అవార్డులను పొందిన వారి అభిప్రాయాలను కూడా తీసుకుంటారు. ఈ ప్రక్రియ అంతా గోప్యంగా జరుగుతుంది. ఏ స్థాయిలోనూ వివరాలు వెల్లడించరు. ఈ ఏడాది ఒక్క శాంతి బహుమతికే 278 నామినేషన్లు అందాయి.

ఏడుగురు భారతీయులు మాత్రమే...

ఎన్నో విషయాల్లో విజయాలు సాధించిన మనం నోబెల్ బహుమతుల విషయంలో మాత్రం బాగా వెనుకబడే ఉన్నాం. ఈ ఏటి విజేతతో కలిపి ఇప్పటి వరకూ కేవలం ఏడుగురు భారతీయులు మాత్రమే నోబెల్ బహుమతులను పొందగలగడం ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన విషయం.

విజేత	విషయం	సంవత్సరం
రవీంద్రనాథ్ ఠాగూర్	సాహిత్యం	1913
సివి రామన్	భౌతికశాస్త్రం	1930
హరగోబింద్ ఖురానా	వైద్యం	1968
మదర్ థెరెసా	శాంతి	1979
సుబ్రహ్మణ్యం చంద్రశేఖర్	భౌతికశాస్త్రం	1983
అమర్త్యసేన్	ఆర్థిక శాస్త్రం	1998
కైలాష్ సత్యార్థి	శాంతి	2014



గమనిక : ★ ఈ ఏడుగురితో పాటు శాస్త్రవేత్త రాజేంద్రకుమార్ పచౌరీ తాను నిర్వహిస్తున్న సంస్థ ఐపిసిసి తరపున నోబెల్ బహుమతిని అందుకున్నారు.

★ వీరిలో హరగోబింద్ ఖురానా, సుబ్రహ్మణ్యం చంద్రశేఖర్‌లు భారతీయులైనప్పటికీ, నోబెల్ అందుకున్నప్పుడు వారు విదేశీయులుగా ఉన్నారు.

★ మదర్ థెరెసా యుగోస్లేవియాలో పుట్టి భారత్‌లో స్థిరపడ్డారు.

భారత్‌తో సంబంధమున్న నోబెల్ విజేతలు

వీరంతా మనదేశ పౌరులు. కాగా తమ సంబంధబాంధవ్యాల ద్వారా కొందరు విజేతలు భారత్‌తో అనుబంధం కలిగి ఉన్నారు. వారిలో...

★ రోనాల్డ్ రాస్, రుడ్‌యార్డ్ కిప్లింగ్ (వీరిద్దరూ భారత్‌లో పుట్టిన బ్రిటిష్ పౌరులు)

★ వెంకటరామన్ రామకృష్ణన్ - రసాయన శాస్త్రం - ఎన్‌ఆర్‌ఐ

★ విఎస్ నైపాల్ - సాహిత్యం - ట్రినిడాడ్ దేశంలో పుట్టి బ్రిటన్‌లో స్థిరపడిన భారత సంతతి వ్యక్తి

★ అబ్దుస్ సలామ్ - భారత్‌లో పుట్టిన పాకిస్తాన్ పౌరుడు

★ దలైలామా - టిబెట్‌లో పుట్టి భారత్‌లో నివసిస్తున్నారు.

★ మహ్మద్ యూనస్ - భారత్‌లో పుట్టిన బంగ్లాదేశ్ పౌరుడు.

వచ్చిన ప్రతిపాదనలు, సేకరించిన వివరాలన్నింటినీ నోబెల్ కమిటీ పురస్కారాల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక సంస్థలకు అందజేస్తుంది. ఈ సంస్థల సభ్యులంతా సమావేశమై చర్చలు జరుపుతారు. చివరకు ఓటింగు నిర్వహించి ఒక్కొక్క అవార్డుకు ముగ్గురు అర్హులను, రెండు ఆవిష్కరణలను ఎంపిక చేస్తారు. శాంతి బహుమతి మినహా మిగిలిన అన్ని అవార్డులనూ వ్యక్తులకు మాత్రమే ఇస్తారు. కాగా శాంతి పురస్కారాన్ని సంస్థలకు కూడా అందజేస్తారు. ఏ సంవత్సరమైనా శాంతి బహుమతికి తగిన వారు ఎంపిక కాకపోతే దాని సొమ్మును వైజ్ఞానిక బహుమతుల నగదుకు కలుపుతారు. నోబెల్ అవార్డులు ప్రారంభమైన ఇన్నేళ్ల చరిత్రలో 19 సార్లు అర్హులు దొరక్క అవార్డును ప్రకటించలేదు.

బహూకరణోత్సవం

ప్రపంచవ్యాప్తంగా వచ్చిన వేల కొద్దీ దరఖాస్తుల నుంచీ కాచివడపోసి అర్హులను ఎంపిక చేయడానికి ఎంత ప్రత్యేకత ఉందో అవార్డుల బహూకరణలోనూ అంతే వైవిధ్యం ఉంటుంది. విశిష్టతా ఉంటుంది. ఆల్ఫ్రెడ్ వర్ధంతి అయిన డిసెంబర్ 10వ రోజున అవార్డులను పురస్కరిస్తారు. ఈ ప్రక్రియ కూడా నోబెల్ 'హోదా'కు తగ్గట్లుగా, అంతర్జాతీయ ఉత్సవంలా నిర్వహిస్తారు. అన్ని అవార్డులనూ స్వీడన్‌లోని ఆల్ఫ్రెడ్ సొంత నగరమైన స్టాక్‌హోమ్‌లో బహూకరిస్తారు. కాగా శాంతి బహుమతిని మాత్రం నార్వే రాజధాని ఓస్లోలో అందజేస్తారు. స్టాక్‌హోమ్‌లో బహుమతులు అందుకునే వారు స్వీడన్ రాజు చేతులమీదుగా అవార్డును స్వీకరిస్తారు. శాంతి పురస్కారాన్ని నార్వే రాజు సమక్షంలో నార్వే నోబెల్ కమిటీ ఛైర్మన్ అందజేస్తారు.

బహుమతి ఎంపికలో వివాదాలు

అత్యంత గుర్తింపు తెచ్చిపెడుతున్న ఈ అవార్డు పొందాలని ప్రపంచవ్యాప్తంగా ఎందరో కలలుగంటారు. అది రాని పక్షంలో ఆశాభంగం చెందిన వారు కొన్ని విమర్శలు చేస్తారు. ఇలాంటివి సాధారణమే. అయితే అవార్డు ఎంపికలోనే పక్షపాతం, రాజకీయం, సామ్రాజ్యవాదం, ప్రజావ్యతిరేక ధోరణులు చోటు చేసుకోవడం తీవ్రమైన విషయం. అందుకే నోబెల్ అవార్డులను ప్రారంభం నాటి నుంచే ఎన్నో వివాదాలు చుట్టుముడుతున్నాయి. ఇవన్నీ చెప్పాలంటే ఒక ఉద్గ్రంధమే అవుతుంది. స్థలాభావం దృష్ట్యా వీటిని ఇక్కడ ప్రస్తావించడం సాధ్యం కాదు. ఇటీవలి ఒకట్రెండు వివాదాలను చర్చిద్దాం.

ఈ ఏటి శాంతి అవార్డుకు ఒక ముస్లిం ఒక హిందు, ఒక ఇండియన్ ఒక పాకిస్తానీకి సంయుక్తంగా ప్రకటించడం, చిన్న అమ్మాయికి ఇవ్వడంలోనూ విమర్శలు వస్తున్నాయి. ఇస్లామిక్ దేశాల్లో అమెరికా చేస్తున్న దాడులను పక్కదారి పట్టించేందుకూ, ముస్లిమ్‌లను ఛాందసులుగా చిత్రీకరించే అగ్రదేశాల కుట్రలో భాగంగానే ఈ అవార్డును మలాలాకు ఇచ్చారని పలువురు విమర్శిస్తున్నారు. అవార్డు ఎంపిక కమిటీ ఛైర్మన్‌గా ఉన్న థార్బ్‌జోన్ జాగ్లాండ్ రాజకీయనాయకుడు కావడం వల్ల ఇందులో రాజకీయం చోటు చేసుకుందనీ చెబుతున్నారు. ఇదే కోవలో 2010లో సాహిత్య బహుమతిని అరాచక కార్యకలాపాలకు పాల్పడి జైల్లో శిక్ష అనుభవిస్తున్న లియు జియాబోకు ప్రకటించడం వెనుక కూడా చైనా ప్రతిష్టను దెబ్బతీసే అమెరికా కుట్రలో భాగమనీ విమర్శలు వచ్చాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రజానుకూలవాదులు, సామాజిక కార్యకర్తలు దీన్ని తీవ్రంగా ఖండించారు.

అన్నిటికీ మించి 2009లో బరాక్ ఒబామాకు అవార్డునివ్వడం అత్యంత వివాదాస్పదమైంది. అమెరికా అధ్యక్షుడైన రెండు నెలలకే ఈ అవార్డును ప్రకటించడం, అందులోనూ అంత క్రితం కూడా ఆయన చేసిందేమీ లేదని పరిశీలకులు తేల్చారు. అయినా అయనకు అవార్డునందజేయడం పూర్తిగా రాజకీయమే అన్నారు. చివరకు స్వయంగా ఒబామాయే 'ఈ అవార్డుకు నేను అనర్హుడిని, నాకెందుకు దీన్ని ఇస్తున్నారో తెలియదు' అని ప్రకటించాడు. అయినా కూడా నోబెల్ కమిటీ అవార్డును ఆయనకే కట్టబెట్టింది. ఇలా అవార్డుల పురస్కారంలో అమెరికా ప్రాభవం, ప్రయోజనాలు, సామ్రాజ్యవాదులు, పాశ్చాత్య పక్షపాతం ఎంత ఉందో చెప్పే వివాదాలు బోలెడన్ని ఉన్నాయి. ఇదే విధంగా హెన్రీ కిస్సింజర్, వంగరి మతాయ్, యాసర్ అరాఫత్– ఇట్జాక్ రాబిన్‌కు అవార్డునివ్వడం కూడా వివాదాలు రేపాయి.

నోబెల్ ఉపన్యాసం

అర్హులు అవార్డులు అందుకునే ముందు తాను అవార్డు పొందిన అంశంపై బహిరంగ 'ఉపన్యాసం' ఇవ్వాల్సి ఉంటుంది. శాంతి బహుమతికి ఎంపికైన వారు బహుమతి అందుకునే డిసెంబర్ 10వ తేదీనే ఉపన్యసిస్తారు. కాగా ఇతర అర్హులు మాత్రం అవార్డు ప్రదానానికి ముందు వారంలో ఉపన్యాసం పూర్తి చేస్తారు. అయితే ఈ లెక్చర్‌ను ఇదే రోజు ఇవ్వాలనే నిబంధన ఏమీ లేదు. బహుమతి విజేతలకు వీలైనప్పుడు ఆ తరువాత ఎప్పుడైనా ఇవ్వొచ్చు. ఉదాహరణకు 1906లో నోబెల్ శాంతి బహుమతిని అందుకున్న అమెరికా అధ్యక్షుడు థియోడర్ రూజ్వెల్ట్ తన పదవీ కాలం పూర్తయ్యాక 1910లో నోబెల్ ఉపన్యాసం ఇచ్చి సరికొత్త సంప్రదాయానికి తెరతీశాడు.

నోబెల్ విందు

అవార్డుల ప్రదానం అయిన తరువాత విజేతల గౌరవార్థం 'బాంకెట్(విందు)' ఏర్పాటు చేస్తారు. స్టాక్‌హోమ్ సిటీ హాల్‌లో స్వీడన్ రాజకుటుంబ సభ్యులతో సహ దాదాపు 1300 మంది అతిథులు వస్తారు. డిన్నర్‌తో పాటు డాన్సు, ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుంది. ఈ కార్యక్రమాన్ని కవర్ చేయడానికి స్వీడన్‌కు చెందిన మీడియాను మాత్రమే అనుమతిస్తారు. శాంతి బహుమతి పొందిన వారి గౌరవార్థం ఇచ్చే విందు కార్యక్రమంలో నోబెల్ విజేతలు, నార్వే రాజు, రాణి, రాచకుటుంబం, ప్రధానమంత్రి, తదితర పెద్దలంతా వస్తారు. అయితే ఇక్కడ అతిథుల సంఖ్య గరిష్ఠంగా 250 మాత్రమే. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ 'నోబెల్ డిన్నర్'కు ఖర్చు కూడా భారీగానే అవుతుంది. అవార్డులు ప్రారంభమైన నాటి నుంచీ క్రమం తప్పకుండా జరుగుతూ వస్తోన్న ఈ విందు కార్యక్రమం ఓస్లోలో 1979లో ఒకేఒక్క సారి మాత్రం జరగలేదు. ఆసంవత్సరపు విజేత మన దేశానికి చెందిన ప్రపంచ సేవకురాలు మదర్ థెరిసా. బాంకెట్‌కు వెచ్చించే సొమ్మును పేదవారికి కేటాయించాలని కోరడంతో విందు రద్దు చేశారు. క్రిస్మస్ రోజున దాదాపు 2000 మంది బీదవారికి పండుగ విందు ఇచ్చారు.

నోబెల్ అవార్డు

అవార్డు కింద విజేతలకు మెడల్, డిప్లొమా సర్టిఫికేట్, నగదును అందజేస్తారు.

మెడల్

18 క్యారట్ల వన్నె కలిగిన 175 గ్రాముల బంగారంతో తయారయ్యే మెడల్‌పై ఒకవైపు ఆల్ఫ్రెడ్ నోబెల్ బొమ్మ ఉంటుంది. మరో వైపు విజేతల పేర్లు ఉంటాయి. బహుమతులిచ్చే నోబెల్ సంస్థలను బట్టి రెండో వైపు డిజైన్ ఉంటుంది.

డిప్లొమా

ప్రత్యేకంగా రూపొందించే డిప్లొమా సర్టిఫికేట్‌పై సాధారణంగా విజేతల గురించిన సైటేషన్ ఉంటుంది. సన్మాన పత్రంలా ఉండే దీనిపై బహుమతి పొందిన వారి పేరు, వారు చేసిన కృషి తదితర వివరాలను పొందు పరుస్తారు.

నగదు

అవార్డు కింద నగదు మొత్తం ఏటికేడూ మారుతుంది. ఈ సంవత్సరం ఒక్కొక్క అవార్డుకూ 11 లక్షల డాలర్ల నగదు అందజేస్తారు. ఒక విభాగంలో బహుమతులు అందుకునే వారు ఇద్దరుంటే, ఇద్దరికీ సమానంగా నగదును పంచుతారు. ఒకవేళ ముగ్గురుంటే అందరికీ సమానంగానూ, లేదా ఒకరికి సగం, మిగతా ఇద్దరికీ మిగిలిన సగం ఇవ్వొచ్చు. ఎవరికెంత ఇవ్వాలనే దాన్ని అవార్డు కమిటీ నిర్ణయిస్తుంది.

రచయిత సెల్ : 9490094436

■ సంగీతం

ఆ పాటలు దీపకళికలు

భారతీయ సంస్కృతిలో కుల, మత, వర్గ విభేదాలు లేకుండా అందరూ కలిసి జరుపుకునే పండుగ దీపావళి. పురాణాల ప్రకారం రాక్షసుడి మీద విజయం సాధించిన రోజుకు గుర్తుగా దీపావళి పండుగ వచ్చింది. ఇది చీకటి వెలుగుల సమ్మేళనం. దీన్ని జీవితంలో వచ్చే కష్టసుఖాలకు కూడా అన్వయించుకోవచ్చు. ఉదయం పూట తీపి తీపి మిఠాయిల్ని బంధుమిత్రులతో పంచుకుని, సాయంత్రం అయ్యేసరికి అమావాస్య చీకట్లో, దీపాల వెలుతురులో మతాబుల వెలుగులు, తారాజువ్వల కాంతులు, చీమ టపాకాయల చిటపటలు, మిణుకుమిణుకుమంటూ వెలుగులు జిమ్మే కాకరపూవొత్తులు... ఇలా రకరకాల దీపావళి మందులతో చిన్నా పెద్దా అందరూ ఆనందోత్సాహాలతో వేడుక చేసుకునే పండుగ ఇది. ముఖ్యంగా పెళ్లయిన ఆడపిల్లలు పుట్టింటికి వచ్చి వేడుక చేసుకునే పండుగ. పండుగల్లోకెల్లా విశిష్టమైనది ఈ పండుగ. దీపావళి అమావాస్య తర్వాత రోజు నుండి కార్తీక మాసం వస్తుంది. వీటి మీద చాలా తక్కువ సినిమాలు, పాటలు ఉన్నాయి. వాటిలో కొన్ని...

దీపావళి పేరుమీద తెలుగులో మూడు సినిమాలు వచ్చాయి. ఒకటి ఎన్టీయార్, సావిత్రి, ఎస్వీ రంగారావు నటించినది. రెండోది 2007 లో వచ్చిన వేణు, ఆర్తి అగర్వాల్ నటించింది.

"చీకటి వెలుగుల రంగేళి జీవితమే ఒక దీపావళి... మన జీవితమే ఒక దీపావళి. మన జీవితమే ఒక దీపావళి..." అంటూ సాగే ఈ పాట అక్కినేని, వాణిశ్రీ నటించిన విచిత్ర బంధం చిత్రంలోనిది. ఆత్రేయ రాసిన ఈ పాట కె.వి.మహదేవన్ సంగీతం సారధ్యంలో సుశీల, ఘంటసాల పాడారు. ఈ చిత్రంలో ఇదే పాట విషాదంతో కూడా మరో సందర్భంలో పాడతారు.

అక్కినేని, కృష్ణకుమారి, బి.సరోజ నటించిన పెళ్లి కానుక చిత్రంలోని "ఆడే పాడే పసివాడ... ఆడేనోయి నీతోడ...ఆనందం పొంగేనోయి దీపావళి... ఇంటింట వెలుగు, దీపాల వెలుగు ఎనలేని వేడుకరా..." పాట ఎ.ఎమ్.రాజా సంగీతంలో పి. సుశీల పాడారు. రచన ఆంజనేయశాస్త్రి (కార్తీక్). ఈ పాట కూడా సంతోషంతో, విచారంతో రెండు సార్లు వుంటుంది.

ఇదే సినిమా హిందీలో రాజ్ కపూర్, వైజంతిమాల, ఉషాకిరణ్ నటించిన 'నజ్‌రానా'గా వచ్చింది. తెలుగులో కృష్ణకుమారి పాడిన ఇదే పాటను హిందీలో 'మలే హై చిరా గో కె రంగీన్ దివాలి హై' అంటూ వైజయంతిమాల పాడుతుంది.

ఇంటింట దీపావళి వచ్చేనమ్మో ఇంటి బంతి చామంతి పాడేనమ్మో... పిలిచినా జీవితం సాగనీ సాగనీ హాయిగా తీయగా... వలపులే (ఇంటింటా దీపావళి)

మామగారు చిత్రంలో అల్లుడు ఇంటికి వచ్చిన సందర్భంలో పాడే పాట "ఇయ్యాల అచ్చమైన దీపావళి.. వెయ్యేళ్లు నిత్యమైన దీపావళి... ఏనాడు ఎల్లిపోని దీపావళి.. ఏరికోరి ఎంచుకుంది మా లోగిలీ...". ఈ పాటలో అల్లుడిని పొగుడుతూ మామగారు పాడతారు.

"చీకటితో వెలుగే చెప్పెను నేనున్నానని... ఓటమితో గెలుపే చెప్పెను నేనున్నానని... నేనున్నానని నీకేం కాదని నిన్నటి రాతనే మార్చేస్తానని..." పాట నాగార్జున, శ్రియ నటించిన నేనున్నాను చిత్రంలోనిది. చీకటి వెలుగుల్లాంటి జీవితంలో తోడుంటానని బాసలు పలికే పాట.

శోభన్‌బాబు, శారద, శ్రీదేవి నటించిన కార్తీక దీపంలోని "ఆరనీకుమా ఈ దీపం కార్తీక దీపం... చేరనీ నీ పాదపీఠం కర్పూరదీపం..."

గోవిందా, జూహిచావ్లా నటించిన ఆమ్‌దానీ అత్తానీ ఖర్చా రూపియా చిత్రంలో "ఆయీయే హై దివాలీ" అనే పాట, 'హరియాలీ ఔర్ రాస్తా, కభికుషీ కభి గమ్ చిత్రాల్లో కూడా దీపావళి పాటలు ఉన్నాయి.

ఈ విధంగా దీపావళి ప్రస్తావనలతో పాటలు కొత్త కాంతులు సంతరించుకున్నాయి. కొన్ని సినిమాల్లో దీపావళి సంబంధించిన సన్నివేశాలు కూడా ఉన్నాయి. ఇవన్నీ జీవితాన్ని కాంతిమంతం చేసే దీపకళికలు.

- బి.మల్లేశ్వరి

పులుసు రాయి

యుద్ధం అయిపోయింది. ఒక సిపాయి మళ్ళీ ఇంటికి పోవాలని బయలుదేరి పోతున్నాడు. అలా పోతూ ఉండగా దారిలో ఒక చిన్న పల్లెటూరు దగ్గరకి వచ్చేసరికి, ఆకాశం నిండా కారు మేఘాలు కమ్ముకొచ్చినాయి. చలిగాలి రివ్వు రివ్వున కొడుతూంది. వీటి అన్నింటికి తోడు కడుపులో ఆకలి దహించుకు పోతుంది. సిపాయి ఆ బాధ ఓర్చుకోలేకపోయాడు. ఆ పల్లెటూరుకు చిట్టచివర ఒక ఇల్లు వుంది, ఆ ఇంటి దగ్గరకు వెళ్ళి ఏదైనా తినటానికి పెట్టమని, ఆకలిగా ఉన్నదని ఆ ఇల్లాలిని అడిగాడు.

"మేమే తిన తిండిలేకుండా తిప్పలు పడుతుంటే నీ కేమి పెట్టగలం బాబూ!" అన్నది ఆ ఇల్లాలు. కొంత దూరం పోయాక, మళ్ళీ ఇంకో ఇంటికి వెళ్ళి, "నాకు చాలా ఆకలిగా వుంది, కాస్త ఏదైన ఉందా?" అని అడిగాడు. ఆ ఇంటామె కూడా "మాకే ఏమీ లేదు నాయనా! పోయిరా!" అంది.

వెంటనే సిపాయి, "పోనిలేండమ్మా, మీ వద్ద ఒక పెద్ద కుండ ఏదైనా ఉందా?" అని అడిగాడు. ఇల్లాలు పెద్దకుండ తెచ్చి సిపాయిముందు పెట్టింది. "మంచినీళ్లు ఉన్నయా?" అన్నాడు, "నీళ్ల కేమీ తక్కువ లేదు. బోలెడన్ని ఉన్నాయి," అంది ఆ ఇల్లాలు.

"అయితే ఆ కుండ నిండా నీళ్లపోసి పొయిమీద పెట్టండి. నా దగ్గర ఒక అద్భుతమైన "పులుసురాయి" ఉంది అన్నాడు. (ఆ దేశంలో వాళ్ళు చిక్కగా పులుసుకాచుకొని మనం పాయసం తాగినట్టు తాగుతారు.) "పులుసురాయి అంటే ఏమిటి నాయనా? మేమెప్పుడూ దాన్ని గురించి వినలేదే," అన్నారు ఆ ఇంట్లో వాళ్లు.

"ఈ పులుసురాయి వేసి కాస్తే పులుసు అమృతంలాగ బలే రుచిగా తయారవుతుంది, అన్నారు సిపాయి. ఆ చిత్రమైన పులుసురాయి చూడటానికి చుట్టుప్రక్కల వాళ్ళందరూ సిపాయి చుట్టూ మూగారు.

ఇంటి యజమానురాలు ఆ పెద్ద కుండనిండా నీళ్లపోసి పొయ్యిమీద

"ఔను ఆ పులుసురాయి చాలా గొప్పది. ఇవ్వాళ నేను చేసినట్లు పులుసు కాస్తే, ఈ పులుసురాయి పులుసును అమితరుచిగా తయారుచేయటానికి ఎన్నాళ్లయినా పనికివస్తుంది"

పెట్టింది. సిపాయి తన జేబులోంచి ఒక రాయి (చూట్టానికి మామూలు గులకరాయి లాగే ఉంది) తీసి కుండలో పడేశాడు. ఇంకా కుండలో నీళ్లు బాగా కాగనివ్వండి" అని చెప్పాడు సిపాయి. అందరూ ఆ కుండ చుట్టూ కూర్చున్నారు. నీళ్ళు బాగా మరిగేంతవరకూ చూస్తూ కూర్చున్నారు. "మీకు వీలుంటే కాస్త చింతపండు, ఉప్పు అందులో వెయ్యండి," అన్నాడు సిపాయి. చింతపండు బుట్ట, ఉప్పుతొట్టి తెచ్చి సిపాయి కిచ్చారు. కుండ పెద్దది కాబట్టి పట్టెడు చింతపండు, పిడికెడు ఉప్పు తీసుకొని ఆ కాగుతున్న నీటిలో వేశాడు. అందరూ సిపాయి ఇంకా ఏమిచేస్తాడో చూద్దామని చుట్టూ చేరారు. "కాసిని క్యారెట్లు (ఎఱ్ఱ ముల్లంగి) దానిలో వేస్తే బాగుంటుందేమో" అన్నాడు సిపాయి. ఆ ఇల్లాలు బల్లకింద దాచిన క్యారెట్లు తెచ్చి తరిగి పులుపులో వేసింది. ఈ క్యారెట్లు ఆ బల్లకింద ఉండటం అంతకు ముందే సిపాయి చూశాడు. క్యారట్లు బాగా ఉడికే లోపల తన చుట్టూ చేరిన వారికి ఎంతో తమాషాగా తాను యుద్ధం చేసిన వీర, సాహస కార్యాలను గురించిన కథలు చెప్పటం మొదలెట్టాడు.

కొన్ని బంగాళాదుంపలు కూడా వేస్తే, పులుసు ఇంకా చిక్కబడి బాగుంటుందని ఆ మాటల మధ్యలో సిపాయి మళ్లీ సలహా ఇచ్చాడు. ఆ ఇంటివారి పెద్ద కూతురు, "కాసిని దుంపలు ఇంటిలో ఉన్నాయిలే", అంటూ, అవి తెచ్చి పులుసులో వేసింది. పులుసు బాగా మరిగేదాకా అందరూ ఊరుకున్నారు.

"ఇంకేమీలేదుగాని, నాలుగు ఉల్లిపాయలు కూడా అందులో పడేశామంటే మంచి కమ్మని వాసన వస్తుంది," అన్నాడు సిపాయి. ఇంటికాపు ఇది వినగానే చిన్న కొడుకుతో పక్క ఇంట్లోంచి కాసిని

ఉల్లిపాయలు అడిగి తెమ్మన్నాడు. వాడు చెంగున పరిగెత్తుకువెళ్లి దోసెడు ఉల్లిపాయలు పట్టుకొచ్చాడు. అవి కూడా పులుసులో పడేశారు. పులుసు తయారైయేలోగా అందరూ కథలు, కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు.

నేను మా అమ్మను, ఇంటినీ వదలి వచ్చింది మొదలు ఇంతవరకు మళ్ళీ క్యాబేజి ముఖం చూడలేదు," అని సిపాయి చెప్పేసరికి, ఆ ఇల్లాలు "త్వరగా వెళ్లి తోటలో క్యాబేజి పువ్వొకటి కోసుకురావే?" అని చిన్న పిల్లను పంపించింది. అదికూడా తరిగి పులుసులో పడేశారు.

ఇంకా కాసేపటిలో పులుసు తయారవుతుందిలేండి. బాగా పక్వానికొచ్చింది," అని సిపాయి అనగానే ఇల్లాలు పొడుగాటి తెడ్డుతో పులుసు బాగా కలియబెట్టింది.

సమయానికి సరిగ్గా ఆ ఇంటిపెద్ద కొడుకు వేటకు వెళ్లి అప్పుడే రెండు కుందేళ్ళను పట్టుకొచ్చాడు. "ఇదిగో చూడండి. పులుసు ఇంకా పసందుగా ఉండాలంటే, ఆ కుందేళ్ళను కోసివేస్తే ఇంకా బాగా రుచి వస్తుందిలాగుందే," అన్నాడు సిపాయి. వెంటనే వాటిని కూడా కోసి పడేశారు. "ఆహా! ఘుమ, ఘుమలాడుతూ, ఎంత కమ్మనివాసన వస్తోందో చూశారా! నోరూరుతుందే," అన్నాడు సిపాయి.

"అబ్బాయి! ఈ బాటసారి ఇవాళ ఒక పులుసురాయి తెచ్చాడు. దాంతో ఈ కుండలో మంచి పులుసు కాచాడు," అని కాపు తన పెద్ద కొడుకుతో చెప్పాడు. చివరకి పులుసు కమ్మగా తయారైంది. పెద్ద కుండలో చెయ్యబట్టి అందరికీ సరిపోయేంత వుంది కూడాను. సిపాయి, కాపు, కాపువాని భార్య, పెద్దపిల్ల, పెద్దకొడుకు, చిన్నపిల్ల, చిన్నకుర్రవాడు అందరూ కూర్చోని లొట్టలు వేసుకుంటూ తాగుతున్నారు పులుసు.

"శెభాష్! ఇది నిజంగా చాలా అద్భుతమైన పులుసు," అని కాపు సంతోషించాడు.

"ఆ పులుసురాయి చాలా అద్భుతమైనది. అదే పులుసుకి అంత రుచి తెచ్చింది," అన్నది కాపు భార్య.

"ఔను ఆ పులుసురాయి చాలా గొప్పది. ఇవ్వాళ నేను చేసినట్లు పులుసు కాస్తే, ఈ పులుసురాయి పులుసును అమితరుచిగా తయారుచేయటానికి ఎన్నాళ్లయినా పనికివస్తుంది," అని సిపాయి చెప్పాడు. అందరూ కలిసి సంతృప్తిగా పులుసు తాగారు.

సిపాయి సెలవు తీసుకొని పోవటానికి ముందు, ఇంటి యాజమానురాలు చూపిన ఆదరణకి మెచ్చుకొన్ని, ఆ పులుసురాయి ఆ ఇల్లాలికి ఇచ్చాడు. ఆమె వద్దని చెప్పినా వినలేదు. "మరేమీ పరవాలేదమ్మా! తీసుకోండి! ఆదేమి పెద్ద ఘనమైన వస్తువు కాదు లేండి" అని, సిపాయి పులుసురాయి పోయిందనే చింతావంతా లేకుండా మళ్లీ తన దారిని తాను పోయాడు.

మరో గ్రామం చేరే ముందు దారిలో సిపాయి మళ్ళీ ఇంకొక గులకరాయి ఏరుకుని జేబులో వేసుకున్నాడు.

(స్వీడన్ కథకు అనువాదం)

అనువాదం : కనకదుర్గా రామచంద్రన్

సమస్యలను ఎదుర్కోవాలా? తప్పుకోవాలా?

వ్యక్తిత్వాన్ని పెంపొందించుకునేవాళ్లకు బోలెడన్ని అవరోధాలు, సమస్యలు ఎదురవుతుంటాయి. జీవతంలో వచ్చే సమస్యలను ఎదుర్కోలేకపోతే వ్యక్తిత్వం వృద్ధి చెందదు. చాలామంది సమస్యలను ఎదొర్కోలేక, వాటిని తప్పించుకోవాలని చూస్తుంటారు. దీనివల్ల సమస్య వాయిదా పడతుందే తప్ప పరిష్కారం కాదు. మామూలుగా పెద్దవాళ్లు గానీ, చిన్నవాళ్లు గానీ సమస్యలను తప్పించుకునే విధానాలు కొన్ని ఉన్నాయి.

★ మనకందరకూ ప్రాథమిక అవసారాలు ఉంటాయి. చక్కగా నిద్రపోవడం, ఉల్లాసంగా ఉండడం అవసరమే. కానీ ఏ పని చేసేటప్పుడు ఆ పని చేయాలి. ఉదాహరణకు విజయ్‌కు చదువు అంటే భయం. అతనికదో సమస్య. క్లాసులో పాఠాలు చెప్పేటప్పుడు అవి వినకుండా నిద్రపోతాడు. చదువు అనే సమస్యనుండి తప్పించుకోడానికి నిద్రపోయి తర్వాతి కాలంలో అంతకంటే పెద్ద సమస్యలోకి కూరుకుపోయాడు.

★ వ్యాధిగ్రస్థులంటే సహజంగానే అందరికీ సానుభూతి ఉంటుంది. అయ్యో.. పాపం! అనారోగ్యంగా ఉన్నారే అంటాం. కొంతమంది ఈ వ్యాధినే సాకుగా చూపించి పనుల నుండి తప్పించుకుంటారు. వారికి పని చేయడం పెద్ద సమస్య.

★ మరికొంతమంది జీవితంలో ఏ చిన్న విజయాన్నీ సొంతం చేసుకోలేరు. ఇలాంటి వాళ్లకి వాళ్ల అంతరాత్మే వాళ్లని ఎగతాళి చేస్తుంది. ఏమీ చేయలేవని నిందిస్తుంది. కానీ వాళ్లు ఆ వాస్తవాన్ని ఒప్పుకోలేక పగటి కలలతో సమయం వెళ్ళబుచ్చుతారు. ఆ పగటి కలల్లోనే ఏవేవో విజయాలు సాధించినట్లు పొంగిపోతారు. ఓ ఊహా ప్రపంచాన్ని సృష్టించుకుని, అందులో గాలి మేడలు కట్టుకుంటారు. తీరా వాళ్లు చేసిన తప్పు తెలుసుకునేసరికి సమయం మించి పోతుంది.

★ చిన్నప్పుడు ఏదైనా కావాలంటే అలిగి, గోల చేసి, ఏడిస్తే ఇంట్లోని పెద్దవాళ్లు బుజ్జగించడానికి ఏవేవో కొనిపిస్తుంటారు. అడిగిందల్లా ఇస్తుంటారు, ఏది చెప్తే అది చేస్తారు. కానీ పెద్దయ్యాక కూడా అదే పద్ధతి కొనసాగిస్తే... చిన్నపిల్లల్లా సమస్యలను తప్పించుకోవాలని చూస్తే జీవితంలో ఎదురుదెబ్బలు తినాల్సి వస్తుంది. ఎవరి ప్రవర్తన అయినా వయసుకు తగ్గట్టుగా ఉండాలి.

★ ఇష్టం లేని వ్యక్తులకు, ఇష్టంలేని పనులకు దూరంగా ఉండడం, వారి పట్ల అసమ్మతి తెలియజేయడం, వారి ప్రవర్తనను, పనులను విమర్శించడం చేస్తుంటాం. ఇలా వారి నుండి ఎదురైయ్యే సమస్యలనుండి తప్పించుకోవాలనుకోవడమే అవుతుంది.

★ ఇంకొంతమంది జీవితంలో వచ్చే సమస్యలను నుండి తప్పించుకోడానికి ఏవేవో పనులు, వ్యాపకాలు వెతుక్కుంటారు. అంటే ఒక పని నుండి తప్పించుకోడానికి మరో పని వెత్తుక్కోవడం అన్నమాట. దీనివల సమస్య వాయిదా పడుతుందే తప్ప పరిష్కారం కాదు.

ఇలా ఏ పద్ధతి అవలంబించినా జీవితంలో అపజయం తప్పదు. అలాంటప్పుడు సమస్య నుండి తప్పించుకోవాలనో, వాయిదా వెయ్యాలనో చూడకుండా దాన్నుండి పూర్తిగా వైదొలగడం ఉత్తమం. చాలా వరకు సమస్యలు బద్ధకం వల్లో, సోమరితనం వల్లో ఉత్పన్నమవుతాయి. ఈ రెండు అవలక్షణాలు వదిలించుకోగలిగితే విజయం సొంతమవుతుంది.

*

నెమలీక

వడ్రంగి - సింహం

అనగనగా ఒక గ్రామంలో ఒక వడ్రంగి వున్నాడు. అతడు ప్రతిదినం అడవికి పోయి కట్టెలు కొట్టుకుని వచ్చేవాడు. ఒకరోజు అతనికి ఒక సింహం ఎదురైంది. వడ్రంగి దాన్ని చూసి భయంతో వణికిపోయాడు. సింహం అతన్ని చూసి జాలిపడింది.

"మానవుడా! భయపడకు! నేను నిన్నేమీ చేయను!" అంది

దాని మాటలు విని వడ్రంగి సంతోషించాడు. తన వద్దనున్న ఆహారం దానికి పెట్టాడు. ఆ తర్వాత వడ్రంగికీ సింహానికీ స్నేహం ఏర్పడింది.

అప్పటి నుండి వడ్రంగి ప్రతిరోజూ సింహానికి మంచి రుచికరమైన పదార్థాలు తెచ్చిపెట్టసాగాడు. వాటిని తిని సింహం తృప్తిగా కాలం గడపసాగింది.

ఆ సింహానికి మంత్రులుగా వున్న కాకి, నక్క సింహాన్ని "ప్రభూ! మీరు ఈ మధ్య వేటాడటానికి వెళ్లడం లేదు. కారణం ఏమిటి?" అని ప్రశ్నించాయి.

సింహం వడ్రంగితో ఏర్పడిన స్నేహం గురించి చెప్పింది.

"అయితే ప్రభూ! మీ కొత్త స్నేహితుని చూడాలని మాకు కూడా ఎంతో ఉత్సాహంగా వుంది. దయచేసి మీ మిత్రుడిని మాకు చూపించండి" అని కాకి, నక్క అడిగాయి.

"తప్పకుండా చూపిస్తాను" అని సింహం వాటికి వాగ్దానం చేసింది. సింహం ఆ మరునాడే, కాకిని, నక్కను వెంట పెట్టుకుని వడ్రంగిని రోజూ కలుసుకునే ప్రదేశానికి బయలుదేరింది.

సింహం రాకకోసం ఎదురు చూస్తున్న వడ్రంగి, సింహంతో పాటు వస్తున్న నక్కను, కాకిని చూశాడు. వెంటనే పరుగెత్తుకుంటూ పోయి ఒక చెట్టు ఎక్కి కూర్చున్నాడు. వడ్రంగి చెట్టు ఎక్కడం చూసి సింహం ఆశ్చర్యపోయింది.

మిత్రమా! నిన్ను చూడాలనే కోరికతో నా మంత్రులు వచ్చారు. కానీ నువ్వు ఈ విధంగా పారిపోయి చెట్టెక్కి కూర్చున్నావేమిటి? " అని అడిగింది సింహం.

"మృగరాజా! నీవు మంచి వాడివే. కానీ నీ వెంట వచ్చిన ఏ సహచరులు కుచ్చితులు. నక్క జిత్తులమారి. కాకిది దొంగబుద్ధి అటువంటి దుష్టుల వెంట ఉన్న నీతో స్నేహం చేయడం ప్రమాదకరం. అందుకనే ఇలా చెట్టు ఎక్కాను" అన్నాడు వడ్రండి. ఆ మాటలు విని సింహం సిగ్గుపడి వెళ్ళిపోయింది.

ఒక్క నిముషం!

ఈ బొమ్మలో పైన బాక్సులో ఉన్న వస్తువులు దాగున్నాయి. ఒక్క నిముషంలో వాటిలో ఎన్ని వస్తువులను కనిపెడతారో వారే గెలిచినట్లు. మరి వెతకండి.





తేడాలు కనిపించాయా

ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు ఏనుగు బొమ్మల మధ్య పది తేడాలున్నాయి. అవి ఎక్కడున్నాయో చెప్పండి.

నీడను పట్టుకోండి

హాకీ ఆడుతున్న ఇద్దరిని పోలిన నీడలు ఐదు ఉన్నాయిక్కడ. వాటిలో ఏది అసలైన నీడో చెప్పండి.

జవాబు : D

రంగులు వేద్దాం



ఆ ఒక్కటి...

ఇక్కడున్న తొమ్మిది బొమ్మల్లో ఒకటి మిగతా వాటితో కలవదు. అది ఏదో గుర్తుపట్టారా?

జవాబు : 4

తాళం చెవి దొరికిందా?



ఈ అబ్బాయికి తాళం చెవి కావాలంట. కానీ అతని ముందు మూడు దారాలు, వాటి చివర మూడు వస్తువులు ఉన్నాయి. వాటిలో ఏ దారాన్ని పట్టుకుంటే తాళం చెవి దగ్గరకు వెళ్తాడో చెప్పండి.

జవాబు : 1

■ సీరియల్

ప్రేమ - విప్లవం

మూలం : మేరీ గాబ్రియేల్

స్వేచ్ఛానువాదం: ముక్తవరం పార్థసారథి, ఫోన్: 91776 18708

(గతవారం తరువాయి)

జెన్నీ, ఆమె తల్లితో కలిసి క్రిస్మస్ జరుపుకోవటానికి డిసెంబర్‌లో క్రూజ్‌నాచ్‌కు బయల్దేరాడు మార్క్స్. ఇప్పుడు పరిస్థితి కాస్త మెరుగ్గానే వుంది. ఉదారవాద మేధావుల మధ్య గౌరవం పెరిగింది. ఆదాయం కూడా పరవాలేదు. ఒకచోట నిలకడగా ఉంటున్నాడు. ఇక పెళ్లి చేసుకోవచ్చు. జూన్‌లో ఆ తంతు ముగిద్దామనుకున్నారు ప్రేమికులు. కాని మార్క్స్ కొలోన్ తిరిగి వచ్చేసరికి 'రైనిష్ జైటుంగ్'ని నిషేధించింది ప్రభుత్వం. దాన్ని ప్రచురించటానికి అనుమతి లేదు. నిషిద్ధ భావాలను ప్రచారం చేస్తున్నది. అది అసలు చట్ట వ్యతిరేక ప్రచురణ అన్నది అభియోగం.

ఆ పత్రిక ప్రారంభమైన రోజునుండీ రైన్‌లాండ్, బెర్లిన్ ప్రభుత్వాలకు కంటిలో నలుసుగానే వుంది. నవంబర్‌లోనే నిషేధం విధిద్దామనుకున్నారు. కానీ, జనవరి 4, 1843 నాడు జార్ నికోలస్–1ను విమర్శిస్తూ ఓ ఆర్టికల్ ప్రచురించటంతో ఏదో ఒక నిర్ణయం తీసుకోక తప్పని పరిస్థితి వచ్చింది. ప్రష్యన్ రాయబారి, సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జార్‌తో భేటీ అయినప్పుడు. ఉదారవాద పత్రికలకు కళ్లెం వెయ్యమని రాయబారిని కోరాడు జార్. జనవరి 21 నాడు, తన మంత్రులతో సమావేశమైన ఫ్రీడ్రిక్ విల్హెమ్.. పత్రికను నిషేధించాలని నిర్ణయించాడు (మార్చి 1843 దాకా పత్రికను నడపవచ్చునని అనుమతి వుంది. కానీ ఇద్దరు సెన్సారు అధికారులు దాని మీద నిఘా పెడతారు).

అయినప్పటికీ, 17 నాడే తన ఉద్యోగానికి రాజీనామా చేశాడు మార్క్స్. కనీసం తన నిష్క్రమణ అయినా పత్రికను నిలబెడుతుందని ఆశ. (కానీ ఆశ, అడియాసగానే మిగిలింది. 'రైనిష్ జైటుంగ్' మార్చి 31 నాడే మూతబడింది.) పత్రికతో తన సంబంధాన్ని తెంచుకోవాలనుకున్న మార్క్స్, 'పత్రికలో నేనుండలేని పరిస్థితి ఏర్పడింది. స్వేచ్ఛ కోసమైనా సరే, అన్ని నీచమైన పనులు చెయ్యనక్కర్లేదు. ఆయుధాలతో యుద్ధం చేసుకోవటం బాగుంటుంది గాని సూటిపోటి మాటల్ని భరించటం కష్టం. హిపోక్రసీ, మూర్ఖత్వం, 'ఇష్టం వచ్చినట్టుగా చేస్తాను అనే తనం', పనులు వాయిదా వేస్తూ పోవటం, ప్రతి పదం గురించీ, కోడిగుడ్డుకు ఈకలు పీకటం ఎక్కువైంది. ఇవన్నీ ఇక నేను భరించలేను... ప్రభుత్వమే నాకు స్వేచ్ఛను ప్రసాదించింది" అంటూ రూగ్‌కో లేఖ రాశాడు.



నిర్మొహమాటంగా చెబుతున్నాను. నేను ప్రేమలో పీకల్దాకా కూరుకుపోయి వున్నాను – చాలా సీరియస్‌గా. మా ఇద్దరికీ ఏడేళ్ల క్రితం ఎంగేజ్‌మెంట్ అయింది. నాకోసం నా ప్రియురాలు ఎన్నెన్ని భయంకరమైన యుద్ధాలు చేసిందో! ఫలితంగా ఆమె ఆరోగ్యం కూడా పాడైంది.

క్రూజ్‌నాచ్, 1843

ఇప్పుడు మార్క్స్ మళ్లీ నిరుద్యోగి. సంపాదన లేదు. రాబోయే అనేక దశాబ్దాలలో ఆయన పరిస్థితి ఇలాగే ఉండబోతోంది. సమాజ నిర్మాణంలోని ఆర్థిక మూలాలను ఆయన నిరూపించిన మాట నిజమేగాని, స్వంత జమా ఖర్చుల విషయానికొచ్చేటప్పటికి చాలా బాధ్యతారహితంగా వ్యవహరించాడు (బహుశా ఈ బలహీనత తెలిసే, పెళ్లికి ముందు మార్క్స్ చేసిన అప్పులకు జెన్నీ బాధ్యత లేదని, ఆమె కుటుంబం, అతని నుండి ఒక హామీ పత్రం రాయించుకుంది). తల్లి నుండి డబ్బు రాబట్టటంలో విఫలమై, తన అంకుల్ లయన్ ఫిలిప్‌ను కలసి తనకు సంక్రమించబోయే ఆస్తిపాస్తుల గురించి తెలుసుకోవటానికి హాలాండ్ వెళ్లాడు మార్క్స్. ఈ విషయమై స్పష్టమైన ఆధారాలేవీ లభ్యం కావటం లేదుగాని ఫిలిప్ బాగానే ఆదుకున్నట్టుంది. ఆ తర్వాత ఒక సంవత్సరంపాటు మార్క్స్ నిశ్చింతగా బతికాడు. కొలోన్‌లో చేసిన ఉద్యోగం నుండి ఏమీ మిగుల్చుకునే అవకాశం లేదు. అంటే ఏడాది ఖర్చు ఫిలిప్ పుణ్యమే.

ఈ కాలంలోనే, మార్క్స్, రూగ్‌తో ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగించాడు. ఫ్రాన్సు కేంద్రంగా కొత్త పత్రిక 'జర్మన్ – ఫ్రెంచి ఇయర్ బుక్' పత్రికను ప్రారంభించటానికి సన్నాహాలు చేసుకుంటున్నాడు రూగ్. కొత్త పత్రిక గురించి మార్క్స్ చాలా ఉత్సాహంగా ఉన్నాడుగాని జెన్నీ ఆందోళన చెందింది. ఒకసారి జర్మనీ వదిలి ఫ్రాన్సు వెళితే, అతణ్ణి తిరిగి దేశంలోకి అనుమతించే అవకాశం లేదు.

అయితే, ఈ సమయంలోనే జర్మనీలో కొనసాగటానికి అతనికి రెండు అవకాశాలు వచ్చాయి. బెర్లిన్‌లోని కోర్టు అధికారి ఒకరు ఒక ప్రభుత్వోద్యోగంలో చేరమన్నారు. బహుశా మరొకటి, ఫెర్డినాండ్ నుండి అయ్యుంటుంది. తనకు కాబోయే బావమరిదిని, జెన్నీకి చేరువలో ఉంచటానికీ, (ఎంగేజ్‌మెంట్ ఎలాగూ రద్దు చేయలేకపోయాడు!) అతడి మీద ఓ కన్నేసి వుంచటానికే మరో ప్రభుత్వోద్యోగం ఆఫర్ చేశాడు. కానీ రెండింటినీ నిరాకరించాడు మార్క్స్.

జర్మనీ సరిహద్దులు రావటమే మేలని భావించాడు మార్క్స్. ఏ ఆంక్షలు ఒత్తిడి లేకుండా, నిష్పాక్షికంగా, నిజాయితీగా పత్రిక నడపాలంటే మరో దేశం పోవాల్సిందే. రూగ్‌నూ, ప్రచురణకర్త ప్రొఫెసర్ జూలియన్ ఫ్రోబెల్‌ను కలవటానికి మే నెలలో డ్రెస్డెన్‌కు బయల్దేరాడు మార్క్స్. వీళ్లిద్దరూ డబ్బు పెడతారు. తను సహ సంపాదకుడిగా ఉంటాడు. కొలోన్‌లో ఇచ్చినంత జీతం ఇస్తారు. అదనంగా అందులో సగం రాయల్టీల రూపంలో. ఈ ప్రతిపాదనకు అంగీకరించాడు మార్క్స్. క్రూజ్‌నాచ్ వెళ్లి ఆర్టికల్స్ తయారుచేసి రెడీగా పెట్టుకుంటాడు. ఈ సందర్భంగా రూగ్‌కు వ్యక్తిగత విషయాలను గురించి ఓ లేఖ రాశాడు. నిజానికి ఇలా రాయటం అతని స్వభావం కాదు.

'నిర్మొహమాటంగా చెబుతున్నాను. నేను ప్రేమలో పీకల్దాకా కూరుకుపోయి వున్నాను – చాలా సీరియస్‌గా. మా ఇద్దరికీ ఏడేళ్ల క్రితం ఎంగేజ్‌మెంట్ అయింది. నాకోసం నా ప్రియురాలు ఎన్నెన్ని భయంకరమైన యుద్ధాలు చేసిందో! ఫలితంగా ఆమె ఆరోగ్యం కూడా పాడైంది. ఒకవైపు ఆమె అరిస్టోక్రాటిక్ బంధువుల నుండి వ్యతిరేకత. పరలోకంలో వున్న దేవుడికీ, బెర్లిన్‌లో వున్న దేవుడి (బెర్లిన్‌లో వున్న దేవుడంటే రాజుగారు) కీ మా సంబంధం ఇష్టం లేదు. అంతేనా, మా కుటుంబంలోని వాళ్లూ దీనికి వ్యతిరేకమే. అందరూ మాకు శత్రువులే'.

ఇంకా అనేక విషయాల గురించి ప్రస్తావించి, తామిద్దరూ 1836లో ఎంగేజ్‌మెంట్ అయిన రోజునుండీ పెళ్లి చేసుకోవటానికి ప్రయత్నిస్తూనే ఉన్నామని స్పష్టం చేశాడు. నిజానికి ఈ పెళ్లికి అందరికన్నా ఎక్కువ అడ్డంకులు

సృష్టించింది తనే తప్ప మరెవరూ కాదు. బాన్, బెర్లిన్, కొలోన్‌లకు ఒంటరిగా ప్రయాణించాడు. దీనివల్ల పెళ్లి ఆలస్యమౌతుందా, జెన్నీ ఒంటరితనంతో బాధ పడుతుందా అని ఆలోచించలేదు. ఆలస్యమైతే ఎంగేజ్‌మెంట్‌కే ప్రమాదమూ రావచ్చు. వివాహం ఎంత ఆలస్యమైనా ఓపికగా భరించింది జెన్నీ. ఆమె కార్ల్‌కు రాసిన లేఖల్లో ప్రేమ తప్ప తన ఆందోళన ఎక్కడా వ్యక్తం కాలేదు. పెళ్లికి ముందురోజుల్లో ఆమె 'నీతో ఎక్కడికైనా వస్తాను. నీకన్నా ముందే బయల్దేరి నీ దారుల్లో వున్న అడ్డంకుల్ని తొలగించి నీకు మార్గం సుగమం చేస్తాను. అదే నా ఆశయం' అంది కార్ల్‌తో.

'ఎదుటి మనిషితో మనం ప్రవర్తించే తీరునుబట్టే మనమేమిటో తెలుస్తుంది... అంటాడు' జర్మన్ తత్వవేత్త యోహాన్ గాట్‌లీబ్ ఫిష్టె. జెన్నీ, మార్క్స్‌ల ఒకరి ద్వారా ఒకరు తమ గురించి తెలుసుకున్నారు. జూన్ 19, 1843 నాడు ఎంగేజ్‌మెంట్ ముగిసింది. క్రూజ్‌నాచ్‌లోని ప్రొటెస్టెంట్ చర్చ్‌లో వివాహం చేసుకున్నారు. మార్క్స్ తరపున ఎవరూ హాజరు కాలేదు. జెన్నీవైపు నుండి ఆమె తల్లి, సోదరుడు ఎడ్గార్ మాత్రమే వచ్చారు. అప్పటికి మార్క్స్‌కు ఇరవై అయిదు, జెన్నీకి ఇరవై తొమ్మిది.

కూతురికి, పెళ్లి కానుకగా శతాబ్దాల నాటి అతి విలువైన వెండి డిన్నర్ సెట్, ఖరీదైన బట్టలు, స్విట్జర్లాండులో హనీమూన్‌కు అవసరమైన ఖర్చులు ఇచ్చింది కారొలైన్. పెళ్లికి ముందు చాలా పొదుపు పాటించింది జెన్నీ. కార్ల్ ఏమీ కొనవద్దు. చివరికి, పెళ్లి డ్రెస్సు, పువ్వులు కూడా. డబ్బులు ఏమాత్రం వృధా చెయ్యకూడదన్నది తొలి నియమం. కానీ పెళ్లి తర్వాత, తొలి రోజుల్లో మార్క్స్ దుబారా ఖర్చును అంగీకరించింది. కళ్ల ముందరే వున్న కొద్ది డబ్బూ కరిగిపోయింది. స్విట్జర్లాండ్ నుండి తిరిగి వస్తూ, దారిలో అనేక చోట్ల ఆగి మిత్రులతో గడిపాడు మార్క్స్. దగ్గరున్న డబ్బంతా ఒక స్ట్రాంగ్‌బాక్స్‌లో పెట్టడం అలవాటు. ఇంకేముంది? వచ్చిన మిత్రులకూ అది అందుబాటులోనే వుంది. మొత్తం మీద క్రూజ్‌నాచ్ తిరిగి వచ్చేనాటికి ఆ బాక్సు ఖాళీ అయింది. భావోద్వేగపరులైన రొమాంటిక్స్ ఇలాగే ఉంటారు. పెర్సీ బి షెల్లీ వీళ్ల ప్రవర్తనను ఆమోదించేవాడే.

కాని దంపతుల ఆలోచనలు ఆకాశంలో విహరిస్తున్నాయి. డబ్బుంటే ఎంత, లేకపోతే ఎంత– మార్క్స్ ట్రంకు పెట్టెల్లో ఉన్న పెన్నిధితో పోల్చితే. హనీమూన్ కాలంలో చదవటానికి వెంట తీసుకెళ్లిన నలభై అయిదు మహా గ్రంథాలు – హెగెల్, రూసో, మాకెయవెల్లి, షమాబ్రియా ...వగైరా. జెన్నీ ప్రేమలో స్థిమితపడ్డ మార్క్స్, కేవలం పుస్తక పఠనం మాత్రమే కాదు, తాను కొలోన్‌లో నేర్చుకున్న రాజకీయ, ఆర్థిక పాఠాలను పున:పరిశీలించి కొత్త ఆలోచనలకు పదును పెట్టాడు. వాళ్ల వివాహం పరస్పర విశ్వాసానికి, అంకిత భావానికి ప్రతీక. ఆమె ప్రేమ అతని మేధో జ్వాలను రగిలించింది. మొత్తం మీద మార్క్స్ హనీమూన్ అధ్యయనం రెండు ముఖ్యమైన ప్రకటనలకు దారితీసింది. ఒకటి : 'మతం ప్రజలకు మత్తు మందు' అన్నది. రెండు : మానవజాతి విముక్తికి దారి చూపేది కార్మికవర్గమే.

అక్టోబర్ చివరిదాకా క్రూజ్‌నాచ్‌లోనే గడిపారు దంపతులు. ఆకాలంలో మార్క్స్‌కు కేవలం రెండే రెండు విషయాల మీద ధ్యాస. ఒకటి ప్రేమ, రెండు పుస్తకాలు. ఆ చిన్న గ్రామంలో ఎవరితోనూ పెద్దగా సంబంధాలు లేవు. రాత్రంతా పగలంతా ఇద్దరూ ఒకరికొకరు కంపెనీ. అది ప్రేమికుల లోకం. జూలైనాటికి జెన్నీ నెల తప్పింది. మార్క్స్ తన మేధో లోకంలో అతి సంక్లిష్టమైన సమస్యలతో తలమునకలుగా వున్నాడు.

అప్పటిదాకా మార్క్స్‌ను అత్యధికంగా ప్రభావితం చేసిన తాత్వికుడు హెగెల్ ఒక్కడే. 'హెగెల్ కేవలం భావ ప్రపంచంలో బతుకుతాడు. వాస్తవ లోకంలో కాదు' అన్నప్పుడు కూడా మార్క్స్ ఇంకా ఆయన ప్రభావం నుండి బయటపడలేదు. అంటే విభేదాలున్నా, ఇద్దరి మధ్యా పరంజా (Scaffolding) ఇంకా చెక్కు చెదరలేదు. హెగెల్ గతితార్కికతను సొంతం చేసుకున్నాడు మార్క్స్. సైద్ధాంతికతకు పరిమితమైన ఆ వాదాన్ని రాజకీయ కార్యాచరణకు అన్వయించాడు. మార్క్స్ ఆలోచనల్లో వచ్చిన మార్పును ప్రభావితం చేసిన మరో వ్యక్తి లుడ్విగ్ ఫాయెర్‌బాక్. ఈయన మార్క్స్‌కూ, బ్రూనోబార్‌కూ మిత్రుడు. 1841లో తను ప్రచురించిన The Essence of christianity పుస్తకంలో దేవుడనే వాడు మనిషి సృష్టి అని వాదించాడు. అందువల్లనే అతడికి మనిషి లక్షణాలన్నీ ఉన్నాయి. అంటే మనిషి తనను తానే ఆరాధించుకున్నాడు. ఇలా చెయ్యటం వల్ల మనిషిలోని ఉత్తమ లక్షణాలను దేవుడికి ఆపాదించి పరాయీకరణకు పాల్పడ్డాడు. ఫలితంగా పరలోకంలోని 'మనిషి' దేవుడైనాడు. అతడి ముందు ఈ లోకంలోని మనిషి మోకరిల్లి ప్రార్థిస్తున్నాడు. ఆ తర్వాత 1843లో తను ప్రచురించిన వ్యాసాలతో. ఆలోచన దేవుడిలాగే – మనిషి వెలుపల వున్నదనడంలో హెగెల్ పొరబాటు చేశాడు. మనిషే ఆలోచిస్తాడు. ఆ ఆలోచనల నుండే దేవుడూ, తత్వశాస్త్రమూ రూపుదిద్దుకుంటున్నాయి.

రాజ్యం (State) అనేది మనిషికి వెలుపల వున్నదని హెగెల్ భావన. అది మనిషిని నియంత్రిస్తున్నది. ఈ అభిప్రాయం తప్పన్నాడు మార్క్స్. మనుషుల సముదాయమే రాజ్యం. మనుషులు తమ చట్టాలను, తమ రాజ్యాంగాన్ని తామే నిర్మించుకోవాలి. అదే మనిషికీ, రాజ్యానికీ కుదరవలసిన ఒప్పందం.

ఆ తర్వాత 'మతం' గురించి విశ్లేషణాత్మకంగా పరిశోధించాడు. మనిషిలోని ఔన్నత్యమే మత భావన అన్నాడు ఫ్రాయర్‌బాక్. అది మనిషి వేదనకు ప్రతిబింబం అన్నాడు మార్క్స్. మనిషి నిర్మించుకున్న ఈ మత భావన మత్తు మందులాగ అతడికి బాధ నుండి ఉపశమనం కలిగిస్తున్నది. ఈ భావన ముందు నిస్సహాయుడు. నిర్వీర్యుడు మనిషి. పీడిత మానవుల నిట్టూర్పు మతం. హృదయం లేని ఈ ప్రపంచ స్పందన మతం. ప్రజలకు నల్లమందు మతం'.

"ఈ విశాల విశ్వంలో మనిషికి తన వైభవోపేత స్థానం గురించి అవగాహన కలిగించాలి. ఇప్పుడున్న ఈ వ్యవస్థను, విలువల్ని, నమ్మకాల్ని చీల్చి చెండాడితే తప్ప ఇది సాధ్యం కాదు. దీని కోసం ఎవర్నైనా ఎదిరించాల్సిందే. రాజీలేని పోరాటం చెయ్యాల్సిందే." ఈ పనులన్నీ చెయ్యటానికే వార్తా పత్రికను నడపాలని రూగ్‌కు చెప్పాడు మార్క్స్. అయితే, అలాంటి పత్రిక వెలువడగలిగిన నగరం అందుకనువైన వాతావరణం వున్న నగరం ఒక్కటే. అదే పారిస్.

★★★

(రెండవ భాగం)

నిలకడలేని కుటుంబం

మేం కొత్త సూత్రాలనేమీ లోకం మీద రుద్దడం లేదు. అసలు విషయమేమంటే, పాత సూత్రాల నుండే కొత్త సూత్రాలను తయారు చేస్తున్నాం.

– కార్ల్ మార్క్స్

సృజనాత్మక ప్రపంచానికి కేంద్రంగా వున్న పారిస్‌లో చిరకాలంగా అనేక ఉద్యమాలు జరిగాయి. అలాంటిదే ఒకటి 1843 లోనూ జరిగి రాజకీయ రంగు పులుముకుంది. ఆ కాలంలో ఫ్రెంచి, జర్మన్, రష్యన్, పోలిష్, హెంగేరియన్, ఇటాలియన్ సంస్కరణవాదులు, చిత్రకారులు, కవులు, నవలా రచయితలు, సంగీతకారులు, తాత్వికులతో కలిసి తిరిగారు. ఊహా ప్రపంచాన్ని కాక వాస్తవ విషయాలను చర్చించాలన్నారు. అరిస్టోక్రాట్లు, విప్లవకారులతో రహస్య సమావేశాలు జరిపి రాజరికం అమలులో వున్న రాజ్యాలను ప్రజాస్వామ్య దేశాలుగా మార్చాలని పిలుపునిచ్చారు. ఇతర దేశాల నుండి పారిపోయి వచ్చిన రాజకీయ శరణార్థులకు అక్కడ అపూర్వ గౌరవం లభించింది. సైనికాధికారులు కూడా తమ లాంఛనాలు తొలగించుకుని పౌర జీవితం గడపటానికే ఇష్టపడ్డారు. ఆకర్షణలకు, హోదాలకు మనసు పారేసుకునే పడతులకు మాత్రమే ఇది నిరాశ కలిగించింది.

ఆ సంవత్సరం కింగ్ లూయీ ఫిలిప్ పరిపాలించిన పారిస్ నగర దృశ్యమిది. యూరోప్‌లోని అన్ని రకాల, అన్ని రంగుల రాడికల్స్‌కూ కేంద్రం ఆనాటి పారిస్.

(సశేషం)

■ అలనాటి పత్రిక

మహిళలు నడిపిన తెలంగాణ పత్రికలు

తెలుగుతల్లి (1939-1945)

అభ్యుదయ సాహిత్య వేదికగా తోడ్పడిన 'తెలుగు తల్లి' సాహిత్య మాస పత్రిక రాచమళ్ళ సత్యవతీదేవి సంపాదకత్వంలో 1939 అక్టోబర్ 1945 మధ్య సికింద్రాబాద్ కింగ్స్‌వే దగ్గర్లోని ఇమాం బావి ప్రాంతం నుండి కొనసాగింది. అడివి బాపిరాజు, వెల్దుర్తి మాణిక్యరావు, సెట్టి ఈశ్వరరావు, వట్టికోట ఆళ్వారుస్వామి దీనికి సహాయ సంపాదకులుగా వ్యవహరించారు. కొంతకాలం తర్వాత వట్టికోట పూర్తి బాధ్యతను నిర్వహించారు.

తెలంగాణ పుణ్యపేటి అయిన బమ్మెర పోతనపై పదకొండు అమూల్యమైన పరిశోధనాత్మక వ్యాసాలు, పన్నెండు పద్య కవితలతో పాటు ఇతరాంశ సంబంధ వ్యాసాలు ఇందున్నాయి. 1/4 సైజులో 168 పుటల్లో సన్న అచ్చులో కూర్పడిన ఈ సంచిక వెల 8 అణాలు కాగా మామూలుగా విడి సంచిక వెల 2 అణాలు.

తాపీ దర్మారావు (ఓ కవీ!), కుందుర్తి (జయించింది), సి.వి.కృష్ణారావు (తృప్తి), ఏల్చూరి సుబ్రహ్మణ్యం, కాళోజీ మున్నగువారి కవితలు - అడివి బాపిరాజు, కొడవటిగంటి కుటుంబరావు, తెన్నేటి సూరి, పొట్లపల్లి రామారావు, చాగంటి సోమయాజులు, ఆళ్వారు స్వామిల కథలు, చంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, తెలికిచెర్ల వెంకటరత్నం, మల్లంపల్లి సోమశేఖరశర్మ, మద్దుకూరి చంద్రశేఖరరావు, కొమాండూరి శఠగోపాచార్యులు, వావిలాల సోమయాజులు, తుమ్మల వెంకట రామయ్య, యం.వి.ఆచార్య, మొదలి శివకామయ్య రచనలు ఇందులో ప్రచురితమైనాయంటే అభ్యుదయ రచయితల రచనలకు తెలుగుతల్లి పత్రిక ఒసగిన ప్రాముఖ్యం ద్యోతకమవుతుంది. తొలితరం కథారచయిత మానేపల్లి తాతాచార్యుల 'తెలుగు కథకులు' వ్యాసం కూడా వీటిలో ఉంది. అభ్యుదయ సాహిత్యంపై సమీక్షలు వెలువరించిన ఈ పత్రిక వామపక్ష విమర్శ పదజాలాన్ని వాడుకలోకి తెచ్చింది.

ప్రారంభమైన మొదటి సంవత్సరంలోనే తెలుగుతల్లి ప్రచురించిన 'పోతన సంచిక' (1940 మార్చి, సంపుటం, సంచిక) పత్రికా సాహిత్య చరిత్రలోనే చిరస్థాయిగా నిలుస్తుంది. తెలంగాణ పుణ్యపేటి అయిన బమ్మెర పోతనపై పదకొండు అమూల్యమైన పరిశోధనాత్మక వ్యాసాలు, పన్నెండు పద్య కవితలతో పాటు ఇతరాంశ సంబంధ వ్యాసాలు ఇందున్నాయి. 1/4 సైజులో 168 పుటల్లో సన్న అచ్చులో కూర్పడిన ఈ సంచిక వెల 8 అణాలు కాగా మామూలుగా విడి సంచిక వెల 2 అణాలు. సంవత్సర చందా రూపాయిన్నరగా సంచిక ముఖ పత్రంపై పేర్కొనబడినది. శ్రీకృష్ణదేవరాయాంధ్రభాషా నిలయంలో 17-2-40 నుండి 23-2-40 వరకు మహోత్సవంతో జరుపబడిన పోతన వర్ధంతి - సారస్వత వారమును పురస్కరించుకుని ఈ పత్రిక సంచిక ప్రకటించబడినది.

1945 జులై సంచిక ప్రఖ్యాత కృష్ణా పత్రిక సంపాదకులు ముట్నూరి కృష్ణారావు స్మృతికి అంకితం కావడం విశేషం. అభ్యుదయ రచయితల సంఘం పక్షాన 1946లో 'అభ్యుదయ' మాసపత్రిక వెలువడటంతో 'తెలుగు తల్లి' పత్రిక ఆగిపోయిందని చెప్పవచ్చు.

తెలుగు దేశం (1948-56)

స్వాతంత్ర్య సమర యోధురాలు సూర్యదేవర రాజ్యలక్ష్మీదేవి సంపాదకత్వంలో 8జూన్ 1948న విజయవాడలో ప్రారంభమైన 'తెలుగుదేశం' వారపత్రిక పోలీసు చర్య తర్వాత 1948 సెప్టెంబర్‌లో హైదరాబాద్‌కు మారింది. హైదరాబాద్ రాష్ట్ర విముక్తి కోసం పోరాడిన ఈ పత్రికకు వల్లూరి బసవ (వి.బి) రాజు, మాడపాటి రామచంద్రరావు సహకారం అందించారు. పి.ఎస్.ఆర్. ఆంజనేయశాస్త్రి కొంతకాలం సంపాదక సభ్యులుగా పనిచేశారు. సర్వోదయ నాయకులు చుండి జగన్నాథం, ప్రముఖ జర్నలిస్ట్ సంతపురి రఘువీరరావు ఇందులో వ్యాసాలు రాస్తుండేవారు. దాశరథి కవితలతో పాటు యువ రచయితలైన గూడూరి సీతారాం కథలు, ఎస్వీ రామారావు, చలన చిత్ర సమీక్షలు ఇందులో ప్రచురితమైనాయి. 1956 ఆగస్టు - డిసెంబర్ మధ్య తమ పత్రికలో సినిమా సమీక్షలు ప్రచురించిన సంపాదకురాలు రాజలక్ష్మీదేవిని స్వయంగా కలుసుకునే సదవకాశం నాకు లభించింది. బాగ్‌లింగంపల్లి లోని ప్రెస్‌లో ముద్రితమైన 'తెలుగుదేశం' కార్యాలయం హిమాయత్‌నగర్‌లో ఉండేది. ఈ పత్రిక ప్రతులను శ్రీ కృష్ణ దేవరాయాంధ్రభాషానిలయానికి ఇచ్చినట్లుగా ఆమె చెప్పారని పొత్తూరి వెంకటేశ్వరరావు రాశారు. ఎన్.టి.రామారావు, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రులుగా ఉన్న కాలంలో 'తెలుగుదేశం' పేరుతో 1982, 1995లో పార్టీ బులెటిన్లు వెలువడేవని కూడా ఆయన పేర్కొన్నారు.

- ఎస్వీ రామారావు

మనోభావాలు

మనందరిలో కొన్ని మనోభావాలు పని చేస్తుంటాయి. వీటినే మన పూర్వులు చిత్త వికారాలు, మనో ధర్మాలు, రసాలు, కోపతాపాలు, రాగద్వేషాలు, అంతర్వర్గాలు అని రకరకాల పేర్లతో పిల్చారు. కొందరు వీటిని ఉద్రేక భావాలు ఉద్రేక భావాలు అని కూడా పిలుస్తారు. ఈ మనోభావాల్లో మూడు లక్షణాలు కనిపిస్తాయి. 1. మన హృదయంలో హఠాత్తుగా ఏదో కొత్త భావం పుడుతుంది. 2. ఈ భావం వల్ల మన దేహంలో మార్పులు (గుండె వేగంగా కొట్టుకోవడం, ఊపిరి ఎక్కువగా తీసుకోవడం లేదా మందగించడం) కలుగుతాయి. 3. ఈ కొత్త భావం ఏర్పడడం ద్వారా శరీరంలో కలిగే మార్పుల వల్ల ఏదో ఒక కొత్త పనికి పూనుకుంటాం.

కొందరిలో ఈ మనోభావాలు ఉత్సాహాన్ని, చైతన్యాన్ని, ఉద్రేకాన్ని రేకెత్తిస్తాయి. తద్వారా ఏదో ఒక పని చేయాలని మొదలుపెడతారు. అందులో విజయవంతం అవుతారు కూడా. ఇలాంటి వారిలో ఎవరైనా ఉత్సాహంగా పనిచేస్తారు. కానీ మరికొందరిలో నిరుత్సాహాన్ని కలిగిస్తాయి. ఏ పనీ పూర్తిగా చేయలేరు.

■ స్ఫూర్తినిచ్చిన గురువు

ఆ నలుగురికి నమస్కారం

నేను నల్గొండ జిల్లా మిర్యాలగూడ నాగార్జున కాలేజీలో ఇంటర్, డిగ్రీ చదివాను. ఆ సమయంలో గుర్తుండిపోయే అధ్యాపకులు నా జీవితంలోకి వచ్చారు. వారు వాడపల్లి రమేష్ (తెలుగు), లక్ష్మీనరసింహారావు (తెలుగు), గుర్రం ప్రభాకరరెడ్డి (సివిక్స్), జి.శ్రీనివాస శాస్త్రి (ఎకనామిక్స్) గారలు.

ముఖ్యంగా రమేష్, లక్ష్మీనరసింహారావు లెక్చరర్లు చెప్పే పద్యాలు, నాటకంలోని రసవత్తరమైన ఘట్టాలు, నవరసాలతో కళ్లముందు నాట్యమాడినట్లే ఉంటాయి. వారు విద్యార్థులతో చాలా స్నేహపూర్వకంగా ఉండేవారు. రమేష్ గారు నేను కాలేజీలో చేరిన మొదట్లోనే ఫీజు కట్టలేని నా ఆర్థిక స్థితి చూసి యాజమాన్యంతో మాట్లాడి ఫీజు రాయితీ ఇప్పించారు. అవసరానికి ఆదుకునే స్వభావం గలవారాయన. లక్ష్మీనరసింహారావుగారు ఎంతో విలువైన సాహిత్యాన్ని, అందుక సంబంధించిన విషయాలను అనర్గళంగా చెప్తూ, విద్యార్థులతో కలిసిమెలిసి ఉండేవారు.

మరో లెక్చరర్ గుర్రం ప్రభాకరరెడ్డి గారు నా జీవితాన్నే మార్చేశారు. ఆయన పౌరశాస్త్రం చెప్తే ఇంకా ఇంకా వినాలనిపించేది. సమకాలీన రాజకీయ ప్రపంచాన్ని కళ్లముందు నిలిపేవారు. ఇంటర్ అయిపోయాక తర్వాత ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉంటే, పిలిచి డిగ్రీలో స్పెషల్ తెలుగు తీసుకొమ్మని సలహా ఇచ్చారు. సార్ చెప్పేది సివిక్స్ అయినా అప్పటి పరిస్థితులను బట్టి వెంటనే ఉద్యోగం రావడం కోసం తెలుగు సబ్జెక్ట్ తీసుకుని, తెలుగు పండిట్ ట్రైనింగ్ తీసుకొమ్మని చెప్పారు. ఆయన సలహా పాటించాను. వెంటనే డిఎస్సీలో తెలుగు పండిట్‌గా సెలక్టయ్యాను.

మరో అధ్యపకులు శ్రీనివాస శాస్త్రిగారు చెప్పే అర్థశాస్త్రం వింటే దుబారా ఖర్చు పెట్టే వారు కూడా పొదుపు బాటలో నడవాల్సిందే. ఇలా ఈ నలుగురి వల్ల జీవితానికి ఎంతో విలువైన విషయాలను నేర్చుకున్నాను. ఇప్పటికీ వీరు ఎక్కడ కనిపించినా సాష్టాంగ నమస్కారం చేయాలన్నంత గౌరవభావం కలుగుతుంది.

- జానపాటి శ్రీనివాస్, మిర్యాలగూడ

అమ్మానాన్నల్లాంటి గురువులు

నా పేరు వి.వీరేష్. నేను అయిజ మండలంలోని ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వరకు చదివాను. ఆ స్కూల్లో పనిచేసిన టీచర్లందరూ ఎంతో మంచివారు. అందులోనూ ఉపాధ్యాయ దంపతులైన వరలక్ష్మి టీచర్, కృష్ణమూర్తి మాస్టారు ప్రత్యేకత కలిగి వుండేవారు. సంప్రదాయ కట్టుబాట్లకు విలువనిచ్చేవారు. వారిద్దరూ బెత్తం పట్టుకోగా నేను చూడలేదు. విద్యార్థుల చదువు, హోంవర్క్ విషయంలో చాలా కఠినంగా వ్యవహరించేవారు. కానీ విద్యార్థులందరినీ ఎంతో ఆప్యాయంగా చూసేవారు. క్లాసులో ప్రతి విద్యార్థికీ పాఠం అర్థమయ్యేలా బోధించేవారు. అప్పట్లో కొందరు ప్రభుత్వ టీచర్లు ఫీజు తీసుకుని ఇళ్ల దగ్గర ట్యూషన్లు చెప్పేవారు. కానీ వీరిద్దరు మాత్రం ఏ విద్యార్థినీ డబ్బు అడిగేవారు కాదు. ఇచ్చిన వారి దగ్గర తీసుకునేవారు. లేదంటే లేదు. కొంతమంది విద్యార్థులు రాత్రి పూట వారింట్లోనే భోజనం చేసి పడుకునేవారు. ఓ సారి నేను రాత్రి లేటుగా వారింటికి వెళ్లాను. నేను అన్నం తిన్నానో లేదో అని అప్పుడే భోజనం చేస్తున్న వరలక్ష్మి టీచర్ అన్నం నాకు పెట్టి తను పస్తు పడుకున్నారు. పైగా కృష్ణమూర్తిసార్ అన్నం వండుకొమ్మని చెప్తే, "ఒక్కపూట ఉపవాసముంటే ఏం కాదులే. పిల్లాడు కడుపు నిండా తిన్నాడు కదా. అది చాలు" అన్నారు. ఆ వయసులో ఆమె మాటలు అర్థం కాకపోయినా... ఇప్పుడా విషయం గుర్తొచ్చినప్పుడు మనసులో ఏదో ఉద్వేగం. ఆమె మాతృత్వ హృదయం ఎంత గొప్పదో, తర్వాత కాలంలో జరిగిన చాలా విషయాల ద్వారా తెలిసింది. ఆ దంపతుల మంచి మనసు జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను.

- వడ్ల వీరేష్, అయిజ, అలంపూర్, మహబూబ్‌నగర్

స్ఫూర్తినిచ్చిన గురువు ఎవరు?

బడికి వెళ్ళినప్పట్నించి కాలేజీ దశ వరకు ఎందరో ఉపాధ్యాయులు మనకు పాఠాలు బోధిస్తారు. వారిలో కొంతమంది గుర్తుండిపోతారు. కొందరు గొప్ప స్ఫూర్తిని ఇస్తారు. వారు చెప్పిన పాఠాలుగానీ, కొన్నిమంచి మాటలు గానీ మనసులో ముద్రించుకుపోతాయి. ఆవిధంగా మిమ్మల్ని ప్రభావితం చేసిన ఉపాధ్యాయుల గురించి ఈ శీర్షికకి రాయండి. మీకు స్ఫూర్తినీ, ఉత్తేజాన్నీ ఇచ్చి ప్రోత్సహించిన ఉపాధ్యాయుల్ని ఈ శీర్షిక ద్వారా గుర్తు చేసుకోండి.

మీ రచనతో పాటు ఫోటో కూడా పంపండి. 'సోపతి'లో ప్రచురిస్తాం.

చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్రజాశక్తి తెలుగు డైలీ, 21/1, ఎమ్.హెచ్.భవన్, అజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగలింగంపల్లి, హైదరాబాద్-20

రచయితలకు సూచనలు

✎ 'సోపతి' కోసం వ్యాసాలు, కథలు, కవితలు పంపించండి.

✎ కథకు పేజీల పరిమితి లేదు. కథ అయి వుండాలి, అంతే! చదివించే గుణమే ప్రధానం.

✎ అనువాద కథ, కవితలు కూడా పంపించవచ్చు. మూల రచయిత అనుమతి పత్రం తప్పనిసరి.

✎ యాత్రా కథనాలకు ప్రత్యేక ప్రాధాన్యం. మీరు చూసి వచ్చిన ప్రదేశాల గురించి, మీ అనుభవ నేపథ్యంలో రాసి, తగిన ఫోటోలతో పంపించండి.

✎ రచనల్ని తిప్పి పంపాలనుకునేవారు తగిన స్టాంపులున్న కవర్‌ని జత చేయాలి.

✎ రచనతో పాటు రచయిత అడ్రసు ఉండాలి.పిన్‌కోడ్ నెంబరు తప్పనిసరి అవసరం. మీ ఫోను నెంబర్, వీలయితే ఈమెయిల్ కూడా ఇవ్వడం మంచిది.

✎ రచనల ప్రచురణకు సంబంధించి ఫోన్లలో ఎలాంటి సంప్రదింపులకు తావు లేదు.

✎ ఆరోగ్యకరమైన హాస్య, వ్యంగ్య రచనలకు ప్రాధాన్యం వుంటుంది.

✎ సమీక్షకోసం పుస్తకాలు పంపేవారు రెండు ప్రతులు పంపించాలి.

చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్రజాశక్తి తెలుగు డైలీ, 21/1, ఎమ్.హెచ్.భవన్, అజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగలింగంపల్లి, హైదరాబాద్-20

■ఎరుక : మునిమడుగుల రాజారావు

ఆయుష్షుని పెంచే నిద్ర!

నిద్ర– మనిషి జీవితంలో ఎంతో ప్రాముఖ్యతని సంతరించుకున్న అంశం. నిద్ర అనేదే లేకపోతే మనిషి ఆయుష్షు సగానికి కుంచించుకు పోయి, మనిషి తన జీవితాన్ని సర్వసమగ్రంగా అనుభవించకుండానే జీవితాన్ని చాలించి ఉండేవాడేమో!

ఈ భూమ్మీద ఇన్నేసి అవిష్కరణలు జరగకుండా ఉండేవేమో! మానవుడు ఇంకా ఎంతగానో వెనకబడి ఉండేవాడేమో!

మనిషి జీవితంలోకి నిద్ర అనేది వచ్చి తన ఆయుష్షుని పెంచి తద్వారా అతడి జీవిత పరిధిని పొడిగించింది.

ఆలోచన లేదా దాని మరో రూపమైన కల నిద్రకి ఆటంకం. 'ఆలోచనా ప్రవాహ వేగం' లేదా 'ఆలోచనల సాంద్రత' లేదా వాటి తీవ్రత ఎక్కువైనప్పుడు నిద్రకి స్థానం లేదు.

మనిషి వెన్నుముక – భూమికి సమాంతరంగా ఉండి ఆలోచనలు పూర్తిగా లేనప్పుడు ఉండే స్థితిని నిద్ర ఆక్రమిస్తుంది. లేదా శారీరకంగా, మానసికంగా మనిషి బలహీనమైనప్పుడు నిద్ర ఆవరిస్తుంది. లేదా తీసుకున్న ఆహారంలో ఆల్కహాలిక్ శాతాన్ని బట్టి నిద్ర వస్తుంది.

వాతావరణంలో పీడన సమతుల్యత లోపించినప్పుడు, అదే వాతావరణం తనలోని మరో భాగంతో పీడన అసమతుల్యతని పూరించుకుంటుంది, అదే విధంగా మనిషి శరీరంలో కాస్మిక్ శక్తి కారకం తాలూకు సమతుల్యత లోపించినప్పుడు నిద్ర అనేది వచ్చి మనిషి మొత్తం వ్యవస్థని తన చేతుల్లోకి తీసుకుంటుంది. అందుకు ప్రధాన కారణం–మనిషి శరీరంలోకి పునరుత్తేజం కలుగచేయటానికే.

నిద్ర సమయంలో ఆలోచనలు పూర్తిగా మాయమైపోయి ఉంటాయి. ఆలోచనలు అనే అడ్డుగోడలు లేకుండా ఉన్నప్పుడు శరీరంలోకి కాస్మిక్‌శక్తి ప్రవేశించి మనిషిని శారీరకంగాను, మానసికంగాను బలోపేతం చేస్తుంది. ఆ కారణం చేతనే–బాగా నిద్ర పోయిన వాళ్ళు, ఎలాంటి కలలు రాని, కలతలేని నిద్రని పొందిన వాళ్లు పొద్దున లేవగానే ఎంతో హుషారుగా, ఎంతో ఉత్సాహంగా, ఎంతో ఆనందంగా అగుపడుతూ ఉంటారు.

రోగ నిరోధక శక్తిని పెంచి పోషించటంలో నిద్ర పాత్ర కచ్చితంగా ఉంటుంది. అందుకనే వైద్యులు– రోగులకు అవసరమైన ప్రతీసారి చెబుతూనే ఉంటారు. "ఎలాంటి ఆలోచనల్లేకుండా, పూర్తి, విశాంత్రితో హాయిగా నిద్రపొండి" అని.

ప్రాకృతిక వరమైన నిద్రని పరిపూర్ణంగా పొందటానికి చేయాల్సిందల్లా–దైనందిన కార్యాల్ని, ప్రతీరోజూ చేపట్టే పనుల్ని పరిపూర్ణంగా చేయటమే! అంటే పూర్తి ఎరుకతో ఉండి, అప్రమత్తంగా ఉండి, ఎంతో ప్రేమతో ఉండి, పూర్తి ఇష్టంతో ఉండి జీవన కర్మల్నిచేస్తూ సాగనంపడమే... సవ్యమైన, సౌఖ్యమైన నిద్రకు మార్గం. కనుకనే నిద్రపోయే ముందు భయంకరమైన సీరియల్స్, టీవీల్లో వచ్చే హింసాత్మక వార్తలు చూడకూడదని చెబుతుంటారు. కలత లేని నిద్ర పోయేవారి జీవనసరళి సాఫీగా ఉండేలా చూసుకోగలరు. తద్వారా వారి ఆయుష్షు ఇనుమడించే అవకాశముంది.

రచయిత సెల్: 94934 30130

వ్యంగ్య వీచికలు ■

నవలకు ఇరవై ఏళ్ళా?

"రచయిత్రి: నా నవల వెలుగులోకి రావడానికి ఇరవై సంవత్సరాలు పట్టింది?

విలేకరి: ఇరవై ఏళ్ళా! అయితే... మీరు చాలా కష్టపడ్డారన్నమాట?

రచయిత్రి: అవును రాయడం నెలరోజుల్లో అయిపోయింది. కాని పబ్లిషర్‌ని వెతుక్కోడానికి ఇరవయ్యేళ్ళు పట్టింది.

నలుగురిలో ఒకరు చైనీస్



సోమేష్: పెళ్ళికి ముందు ఓ అరడజను మంది పిల్లల్నైనా కనాలని మీ ఆవిడ అంటుండేవారు కదా. మరి ముగ్గురితో ఆపేశారేం?

కామేష్: ప్రపంచంలోని ప్రతి నలుగురు పిల్లల్లో ఒకరు చైనీస్ అని చదివి, నేనే వద్దన్నా?

కిరాయి

రమేష్: అయిదేళ్ళ నుంచి నువ్వు ఇంత బాగా పనిచేస్తున్నా మీ బాస్ నీకు జీతం ఎందుకు పెంచడం లేదు?

ప్రకాష్: ఏమో తెలియదు.

రమేష్: మరి నువ్వు ఎప్పుడూ అడగలేదా?

ప్రకాష్: అడగలేదు.

రమేష్: అందే ఎందుకు?

ప్రకాష్: నేను వాళ్ళ ఇంట్లోనే కిరాయికి ఉంటున్నా. జీతం పెంచమంటే కిరాయి కూడా పెంచమంటారని.

కొత్తదనం

కాంతమ్మ: మా అల్లుడు చేసే ప్రతి పనిలోనూ కొత్తదనం వుండాలి అంటారు.

రాంబాయమ్మ: ఏమంటాడేమిటి?

కాంతమ్మ: పెళ్ళిలో అందరూ కాళ్ళు కడిగి కన్యాదానం చేస్తారు కదా! అందుకని తనకు కాళ్ళకి బదులు చేతులు కడిగి కన్యాదానం చేయమని ఒకటే గొడవ చేశాడు.

మిగిలేది కన్నీళ్ళే!



గెలిచినప్పుడు 'జ్ఞాపకాలు' మిగులుతాయి... ఓడినప్పుడు 'అనుభవాలు మిగులుతాయి. కానీ గెలుస్తామో, ఓడతామో తెలియని 'ప్రేమ'లో పడితే మాత్రం 'కన్నీళ్ళే' మిగులుతాయి.

సప్తపర్ణిపై స్పందన

చిత్రకళామాలిక



సప్తపర్ణి - కాండ్రేగుల నాగేశ్వరరావు,
పేజీలు: 333, వెల : రూ. 777/-
ప్రతులకు : ప్రముఖ పుస్తక కేంద్రాలు

తను శవమై
ఒకరికి వశమై..
తనువు పుండై
ఒకరికి పండై..
ఎప్పుడూ ఎడారై..
ఎందరికో ఒయాసిస్సై...

గీతం మొత్తం ఒకటే బొమ్మ... అన్ని బొమ్మలు గీతమైతే... వేసే ప్రతీ అడుగు...

ఒక అద్భుతం వైపు... అలిశెట్టి ప్రస్తావించినట్లుగా...కాండ్రేగుల నాగేశ్వరరావు. "సప్తపర్ణి" తెరిస్తే... అలా కనిపిస్తుంది. ఒక బొమ్మ (చిత్రం) ఎలా జన్మిస్తుందో... ఎంతటి ధ్యాన ముద్రకావాలో... "మడిసన్నాక కాస్తంత కళాపోషణ ఉండాలి" అన్న ముత్యాలముగ్గు డైలాగ్ మదిలో మెదులుతుంది. వీరికి చిన్ననాటి నుండే ఆ దృష్టి అబ్బే ఈ పుస్తక సృష్టి జరిగిందనిపించింది. అద్దాల బిడ్డగా వున్నప్పుడే వారి నాన్న గారు ఒక బేడ పైసాతో వీరి పేర్ల మీద లాటరీ కట్టగా... ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు రవివర్మ వేసిన చిత్రం తనకు తెలియకుండానే... ఆ కళాఖండానికి సొంతదారుడయ్యాడు.. ఆ రోజు నుండి చిత్రకళలోని ... సిత్రాలు చూస్తూ.. చిత్రాలపై శ్రీకారం చుట్టి, క్రమేపి అభిరుచిగా మారి కళల-యాత్ర కదిలింది. ఆకు కదిలినా... పువ్వు పూసినా... నవ్వు విసిరినా... ఇదంతా తన కోసమే అనుకునే మౌన స్పందన అతనిది. అందుకనేమో.. "సప్తపర్ణి"ని పట్టుకోవాలన్న ఆనందం, చూసే ప్రతి పేజీ ఓ గోడపత్రం... మనసును పలకరించిన పులకరింత లెన్నో.... మదిలో మెదలాడినాయి. ఇందులో ఉన్న ప్రత్యేకతలను చూసినప్పుడు డచ్ చిత్రకారుడు వెర్మీర్ (1632-1675) నుండి చిత్రకళలో ఉత్తమోత్తమ శైలులను ఆపోశన పట్టిన అగస్త్యుడు మాధవసతాల్‌కర్, మాగ్రెటీ (1898-1967) దావించీ, మైఖెలాంజిలో, రాఫెల్, మిలేస్, బెంద్రే చిత్రాలున్నాయి, నర్మగర్భితమైన మోనాలిసా చిరునవ్వు నుండి గగుర్పాటు కలిగించే పికాసో గుయెర్నికా, ఎం.ఎఫ్, హుస్సేన్, హెన్రీ రూసో వరకూ ప్రపంచ అద్భుత చిత్రకారులు సుమారు 40 మంది చిత్రాలను వారి జీవిత విశేషాలలో పేర్కొన్నారు. కాపురాజయ్య, కొండపల్లి శేషగిరిరావు, చింతల జగదీష్, పూసపాటి, ఏలే లక్ష్మణ్ చిత్రాలను కూడా చూడవచ్చు. ఇందులో పేర్కొన్న ఒక్కో కళాకారుడు ఒక్కొక్క హిమశిఖరం. వారి గురించి తెలుసుకున్నామన్న ఓ మంచి అనుభూతి కలుగుతుంది. ఈ పుస్తకానికి ముందుమాట రాసిన అశ్వినీ కుమార్ వాక్యం కళాకారులందరికి వర్తించే ఈ మాట. "ఒక కళాకారుని కృషి వెనుక చెవి యొగ్గి వినగలిగితే... అతని స్వీయ ఘోష వినబడుతుంది. కవి'నే' నంటే మేమని అర్థం" అంటారు. అల, కళ అనుభవైక వైద్యం, భాషకందని మధుర భావనలవి, మంచి అనుభూతి అవ్యక్తమైన అనందం కలిగిస్తుంది.

అంతేకాదు తనకు నచ్చిన, జనం మెచ్చిన మంచి సినిమాలు మరోమారు గుర్తుచేశారు. రాజు-పేద, బంగారుపాప, ముసాఫిర్, ప్యాసా, సంస్కార, యు.ఆర్.అనంతమూర్తి, గిరిష్‌కర్నాడ్ మహల్, దేవదాసు, మదర్ ఇండియా, మేఘ్‌ధాఖేతారా, బాటసారి, గుజారిష్, మిథునం వరకూ సమీక్షించారు. చక్కటి సంక్షిప్త సారాన్ని అందించారు. అంతేకాదు ప్రపంచ సాహిత్యం డాక్టర్ కేశవరెడ్డి రావిశాస్త్రి నవలలు, సంగీత సుగంధమయిన బైజు బావరా గురించి వివరించారు. క్రీస్తు పూర్వం నాలుగువేల సంవత్సరాల క్రిందటి మెసపొటోమియా శిల్పం, సింధు నాగరికత శిల్పాలు, గ్రీకు శిల్పాలు నార్వే దేశపు విజిలాండ్ పార్క్ గ్రానైట్ చిత్రాలు ప్రత్యక్షంగా చూసిన చక్కటి అనుభూతి. ఇట్లాంటి పుస్తకాలు (ఆల్బమ్) ప్రభుత్వ ఖర్చుతో వేస్తే తక్కువ ధరకు లభ్యమయ్యేది. సొంత ఖర్చుతో... సప్తవర్ణాలతో కూడిన చక్కటి పేపర్‌తో ముద్రించారు. కాని సామాన్య విద్యార్థులు, అసక్తి గలిగిన వారు కొనలేనంతగా ఉంది. ఇంటి లైబ్రరీల్లో ఉండదగిన పుస్తకం కాని పుస్తకం వెలకు - జేబులో పర్స్‌కు పొంతన కుదరదు కాని తప్పక చదవదగిన పుస్తకం. రచయితకు ధన్యవాదాలు.

- భూపతి వెంకటేశ్వర్లు, 9490098343



ఇందులో ఉన్న ప్రత్యేకతలను చూసినప్పుడు డచ్ చిత్రకారుడు వెర్మీర్ (1632-1675) నుండి చిత్రకళలో ఉత్తమోత్తమ శైలులను ఆపోశన పట్టిన అగస్త్యుడు మాధవసతాల్‌కర్, మాగ్రెటీ (1898-1967) దావించీ, మైఖెలాంజిలో, రాఫేల్, మిలేస్, బెంద్రే చిత్రాలున్నాయి, నర్మగర్భితమైన మోనాలిసా చిరునవ్వు నుండి గగుర్పాటు కలిగించే పికాసో గుయెర్నికా, ఎం.ఎఫ్, హుస్సేన్, హెన్రీ రూసో వరకూ ప్రపంచ అద్భుత చిత్రకారులు సుమారు 40 మంది చిత్రాలను వారి జీవిత విశేషాలను పేర్కొన్నారు.

■ **నవరాగం**

ఒక మనిషిని ఎలాంటి షరతుల్లేకుండా ఇష్టపడడం, ఎలాంటి కారణాల్లేకుండా ప్రేమించడం అపురూపం. ఆ ప్రేమ భావాన్ని కల్పించిన మనిషి జన్మ ధన్యం. అలాంటి ప్రేమ భావన వున్న మనిషి జన్మ మానవాంశకు సత్కారం.

ఆమె అంటే అతగానికి వల్లమాలిన ప్రేమ.

ఎంత ప్రేమంటే ఆమె గతాన్ని కూడా కళ్ళముందు దర్శింపజేసుకోవాలన్నంతగా.

తపన, తపన, తపన... ఆమె పుట్టిన హాస్పిటల్, తొలిసారిగా అడుగులు వేసిన ఇల్లు... ఆమె అక్షరాలు దిద్దుకున్న బడిని చూడాలన్న తపన... ఆమె చేత అక్షరాలు దిద్దించిన టీచర్‌కు దండాలు పెట్టాలన్నంత తపన.

అనురాగపు హస్తమే ప్రేమ!

ఆమె చదివిన ప్రైమరీ స్కూలు, హైస్కూలు, కాలేజీ, ఆమె షాపింగ్ చేసిన ప్రదేశాలు.. స్నేహితులతో ఆమె తిరిగిన ప్రాంతాలు అన్నిటినీ ఆమెతో కలిసి చూడాలనీ, ఆ జ్ఞాపకాలన్నిటినీ కలబోసుకోవాలని... ఎంతెంత ఆరాటం.

ఆమె మొదటిసారిగా చూసిన సినిమా థియేటర్‌కు వెళ్ళి ఆమెతో కలిసి సినిమా చూడాలని...

కామర్స్ మేడమ్‌ని కలసి కాలేజీలో ఆమె చేసిన అల్లరిని తెలుసుకొని, ఆమె చొరవకీ, చురుకుదనానికీ ముచ్చటపడ్డాడు. ఆమె మీద ఇష్టం మహాఇష్టంగా మారింది. ఆమెకు సంబంధించిన ప్రతి అంశం అతనికి మురిపెంగా, అపురూపంగా తోచింది.

ఆమెకు ఇష్టమైన పాటలు మళ్ళీ మళ్ళీ ఆమెతో కలిసి వినడం...

ఆమె చదివిన పుస్తకాల్లోని ఆకర్షణీయ ఘట్టాల్ని మరల ఇద్దరు కలిసి చదువుకునేంత ఇష్టం...

ఆమె శైశవాన్ని, బాల్యాన్ని, కౌమారాన్ని, తొలిప్రాయపు యవ్వనపు అలల సోయగాన్ని సరికొత్తగా దర్శించి, ఆమెకు దర్శింపజేసి, అప్పుడే పుట్టినంత అందంగా జీవితాన్ని ఆనందమయ అర్ణవంగా మలచిన అతని ప్రేమ...

జీవితమే సఫలమూ... రాగసుధాభరితమూ అనిపించేంత ప్రేమ.

ఆమె మీద ప్రేమ... ఉపమానాలకు అందనిది.

ఆమెకు సంబంధించిన ప్రతి జ్ఞాపకాన్ని మృదుమధురంగా పంచుకోవాలన్న అతగాని ఇష్టం, ప్రేమ ఆమెని నిలువనియ్యకుండా చేస్తుంది. తెలియని పరవశానికి లోను చేస్తుంది.

ఎలాంటి ప్రశ్నలు వేయకుండా తను భావోద్వేగాల పరంపరను మన్నిస్తూ, ఆమోదిస్తూ అభివ్యక్తం చేసే అతని ప్రేమ... ఆ ప్రేమ పారవశ్యపు తాలూకు మధురిమ ఆమెకు ఊహాతీతమైన అనుభవం!

ఎక్కడున్నా, ఏం చేస్తున్నా ఆలోచనలన్నీ ఆమె గురించే! ఏ పని చేయాలన్నా, ఎక్కడికెళ్ళాలన్నా ఆమె తోడు ఉండాలన్న బలీయమైన వాంఛ.

ఇంతటి వల్లమాలిన ప్రేమని చూపే అతడు ఎవరు?

ఎవరైనా కావచ్చు. అతను మహా ప్రేమికుడు. మానవీయ స్పర్శ తెలిసినవాడు. ప్రేమించడమనే గుణాన్ని సహజంగా సంతరించుకున్నవాడు.

మరి అలాంటి ప్రేమికుని కోసం ఆమె ఏం చేస్తుంది?

నిజానికి ఏమీ చేయక్కర్లేదు.

సున్నితంగా ప్రతిస్పందించాలి.

ఆ ప్రేమదీపాన్ని కాపాడుకోవాలి.

ప్రేమ చూపితే ప్రేమ లభించును అన్న లోకోక్తికి అనుగుణంగా స్పందిస్తే వారి ప్రేమ ఎప్పటికీ కొత్తగా, సృజనాత్మకంగా పరిఢవిల్లుతుంది.

నిజంగా ఇలా ప్రేమిస్తారా? ప్రేమించగలరా?

మనుషుల మధ్య ఇలాంటి ప్రేమ సాధ్యమా? అనే ప్రశ్నలు రావచ్చు.

సాధ్యమే అన్నది సమాధానం.

ఎప్పుడంటే–

ఎదుటి మనిషిని యధాతథంగా స్వీకరించగలిగినప్పుడు.

ఎలాంటి ఫిర్యాదుల్లేకుండా ఆమోదించినప్పుడు.

అసూయాద్వేషాలకీ అతీతంగా ఆ మనిషి సౌఖ్యాన్ని కోరినప్పుడు.

జీవితంలో జయాపజయాలతో సంబంధం లేకుండా మనిషిని స్వీకరించే దయాగుణం ఉన్నప్పుడు.

ఈ లక్షణాలున్న ఇద్దరు స్త్రీ పురుషుల మధ్య ప్రేమ అపురూపం. అలాంటి ప్రేమ కోసం మనుషులు జీవితమంతా పాకులాడుతారు. అనేకానేక సంక్షోభాలు, సంక్లిష్టతలు, సంఘర్షణలున్న చోట ఇలాంటి ప్రేమ కలిగేనా? కలిగినా నిలిచేనా? నిలిచి వెలిగేనా? అన్న ప్రశ్నలు మళ్ళీ మళ్ళీ వస్తాయి.

నిజానికి సంఘర్షణలు, సంక్లిష్టతలు, సమస్యలున్నప్పుడే కదా కావాల్సింది ప్రేమ!

అంతా సజావుగా, సౌఖ్యంగా ఉన్నప్పుడు కాదు, సంక్లిష్టతలు సవాల్ చేసే పరిస్థితుల్లో మనిషికి ఓదార్పుగా భుజమ్మీద చేయి వేసి లాలించే అనురాగపు హస్తమే ప్రేమ!

అలాంటి కరుణాంతరంగపు ప్రేమ కోసం వెతుకులాటే మనిషి జీవితం!

– ప్రణీత్

గాఢమైన ప్రేమ... ప్రపంచ స్వరూపాన్ని చూడనివ్వదు! – బార్బారా కార్ట్‌లాండ్

సోర్స్ కోడ్ కె.ఎక్స్.రాజు

3జి పాయే... 4జి వచ్చే.. 5జి మిగిలిపాయే...

ఇప్పుడు రాష్ట్రంలోను, దేశంలోను అత్యధికంగా వినిపిస్తోన్న పదం '4జీ'. అత్యంత వేగంగా వృద్ధి చెందుతోన్న కమ్యూనికేషన్ రంగంలో ఇదో నవశకం. సమాచార మార్పిడి మరింత వేగం పుంజుకోవడానికి 2జి వచ్చింది. అయితే ఈ 2జి సాంకేతికత కంటే 2జీ కుంభకోణం గురించే ప్రజలకు ఎక్కువ తెలిసింది. ఈ 2జి టెక్నాలజీ పూర్తిగా ప్రజలకు తెలియక ముందే 3జి వచ్చేసింది. 3జితో అద్భుతాలు జరిగిపోతానే విధంగా టెలికం కంపెనీలిచ్చిన ప్రకటనలతో 3జి సెల్‌ఫోన్లు, కనెక్షన్ తీసుకునే వారు పెరిగారు. అయితే సరైన క్వాలిటీ లేకపోవడం, వీడియో కాల్స్, డేటా ట్రాన్స్‌ఫర్ వేగంగా లేకపోవడంతో కస్టమర్లు మోసపోతున్నారు. కంపెనీలు 4ఎంబిపిఎస్ (మెగాబైట్స్ పర్ సెకన్) వరకు డేటా ట్రాన్స్‌ఫర్ అని చెబుతున్నా 1ఎంబిపిఎస్ కూడా రావడంలేదని వినియోగదార్లు గగ్గోలు పెడుతున్నారు. 3జి సంగతి ఇలా వుంటే చైనా, జపాన్‌లలో 4జి యుగం మొదలయ్యింది. ఈ సందట్లో వుండగానే 5జి టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చే దిశగా దక్షిణ కొరియా అడుగులో వేస్తోంది.

ప్రస్తుతం మనం 3జీ టెక్నాలజీని వాడుతున్నాం. 3జి స్మార్ట్ ఫోన్లు ఇప్పటికే వీరవిహారం చేస్తున్నాయి. టాబ్లెట్లు, లాప్‌టాప్‌లు కూడా తామూ తక్కువేం తినలేదంటున్నాయి. దాదాపుగా చాలా పనులు 3జితో జరిగిపోతున్నాయి. అయితే బ్యాండ్‌విడ్త్ సరిపోక పోవడం వల్ల తలెత్తే సమస్యలకు 4జి సరైన సమాధానం అని నిపుణులు చెబుతున్నారు. అయితే.. అసలు 'జి' అంటే ఏమిటి?

'జి' అంటే..? 1జి. 2జి, 3జి.. ఇలా ఇవన్నీ కూడా వాటి ద్వారా ప్రసారమయ్యే సమాచారం(డేటా) వేగాన్ని సూచిస్తాయి. మొన్నటి వరకు మొబైల్ ఫోన్‌ను మాట్లాడటానికి మాత్రమే వాడేవారు. అదే మొబైల్ ద్వారా ఇంటర్నెట్‌ను కూడా అందించవచ్చని తెలిసిందో, అప్పటినుండి స్మార్ట్‌ఫోన్ల వాడకం వెల్లువలా మొదలైంది. 1980 ప్రారంభంలో టెలిఫోన్/మొబైల్ సమాచార పరిశ్రమలో 1జి కొనసాగింది. 'జి' అంటే జనరేషన్ అని అర్థం. ఇందులో అనలాగ్ ప్రమాణాలను ఉపయోగించారు. దీని ఫ్రీక్వెన్సీ మాడ్యులేషన్ 150 ఎంహెచ్‌జెడ్. ఇది చాలా తక్కువ వేగం మాత్రమే కాకుండా కేవలం శబ్ద ట్రాఫిక్‌కు మాత్రమే సపోర్ట్ చేసేది. దీనిలోని అననుకూలతలను అధిగమించే దిశగా 2జి ఆవిర్భవించింది. ఈ 2జీలో 'డిజిటల్' ప్రమాణాలను ప్రవేశపెట్టారు. 'అనలాగ్' కంటే డిజిటల్ ప్రమాణాలు అత్యంత వేగవంతమైనవి కావడంతో వినియోగదారులకు మరింత సౌలభ్యం చేకూరింది. ఈ సాంకేతికత ఫలితమే మొట్టమొదటి 'ఎస్ఎంఎస్' రూపకల్పనకు నాంది పలికింది. ఆ తర్వాత 2జి నుంచి 2.5 జి, 2.75జిలను అభివృద్ధి చేసారు.

ఇక 3జి విషయానికొస్తే.. ఇది విభిన్న తేడాలు, వేగంగా వుండడం, శబ్దం/వీడియో కాల్స్, డేటా అందుబాటులో వుండటం దీని ప్రత్యేకతగా చెప్పాలి. అంతే కాకుండా సరికొత్త వేగాన్ని అందుకొనేందుకు వీలుగా 3జిని మరింత అభివృద్ధి చేశారు. తద్వారా 5ఎంబిపిఎస్ నుంచి 14ఎంబిపిఎస్ వరకు వేగం పెరిగింది. డౌన్‌లింక్ ప్యాకెట్ యాక్సెస్ (హెచ్ఎస్‌డిపిఎ) వేగాన్ని మరింత గరిష్ఠం చేయడం ద్వారా, నెట్‌ను ఉపయోగించే సెల్‌ఫోన్ వినియోగదార్లకు మరింత ఉపయోగకరంగా మారింది. అయితే పెరుగుతున్న సాంకేతిక అవసరాల రీత్యా మరింత వేగవంతమైన సమాచార వ్యవస్థకు అంకురార్పణ జరిగింది. అదే 4జి. ప్రపంచంలో తొలిసారిగా డిసెంబర్ 2009లో స్వీడన్ రాజధాని స్టాక్‌హోంలో 4జి ప్రసారాలు ప్రారంభమయ్యాయి. ఆఫ్రికా ఖండంలోని కొన్ని దేశాలు తప్ప దాదాపు ప్రపంచ దేశాలన్నీ 4జి సేవల్ని అందుకోవడమో లేదా సన్నద్ధమయ్యే స్థితిలోనో ఉన్నాయి.

4జి అంటే.. 2009లో మొదటిసారిగా మాటల ట్రాఫిక్ కంటే డేటా ట్రాఫిక్ ఎక్కువగా నమోదయింది. ఫోన్లలో ఇంటర్నెట్ వాడకం వ్యక్తిగత స్థాయిని దాటి, వ్యాపార స్థాయికి చేరింది. దాంతో 2జి, 3జిల ద్వారా లభ్యమయ్యే పరిమిత బ్యాండ్‌విడ్త్ ఏ మూలకి సరిపోవడం లేదు. దాంతో ఇప్పుడున్న ఫ్రీక్వెన్సీలోనే మరింత వేగవంతమైన డేటా ప్రసారంకోసం ప్రయత్నాలు మొదలెట్టి 2010లో ఈ సాంకేతికత సాధించారు. దీన్నే 4జి (ఫోర్త్ జనరేషన్) అని వ్యవహరిస్తున్నారు. 3జి కంటే 4జి వేగం సగటున 5 నుంచి 10 రెట్లు ఎక్కువగా ఉంటుంది. 4జీలో అంతర్గతంగా వాడే సాంకేతికత ఆధారంగా 4జి ఎల్‌టిఇ, 4జి వైమ్యాక్స్‌లుగా కూడా పిలుస్తున్నారు. అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ సంఘం (ఐటియు) నెలకొల్పిన ప్రమాణాల ప్రకారం 4జి వేగం కనిష్ఠంగా సెకనుకు 100ఎంబిపిఎస్, గరిష్ఠంగా 1000 ఎంబిపిఎస్ గాను ఉండాల్సి వుంది. 3జి వేగం కేవలం 7.2 ఎంబిపిఎస్ మాత్రమే. నిర్విరామ, నిరంతరాయ కనెక్టివిటీ, అత్యంత నాణ్యతతో కూడిన వీడియోలు, అద్భుతమైన శబ్ద నాణ్యతతో పాటు వీడియో చాటింగ్, కాన్ఫరెన్స్, ఆన్‌లైన్ ఆటలు, ఆన్‌లైన్ స్ట్రీమింగ్ (ఎక్కడో ఉన్న వీడియో/ఆడియో ఫైల్‌ను మన మొబైల్‌లో హైస్పీడ్ ఇంటర్‌నెట్ ద్వారా ప్లే చేయడం) సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. ఎంత పెద్ద ఫైల్ అయినా చిటికెలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

5జి మాటేమిటి..? ప్రస్తుతం 4జి సర్వీసులను విస్తరించేందుకే పలు దేశాలు ఆపసోపాలు పడుతున్నాయి. కానీ వీటికన్నా ఒక అడుగు ముందుకు వేసిన దక్షిణ కొరియా 4జికన్నా వెయ్యి రెట్లు వేగంగా పని చేసే 5జిపై కన్నేసింది. ఆ దిశగా దక్షిణ కొరియా ఇప్పటికే అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా 5జి సర్వీసును వీలైనంత త్వరగా తీసుకువచ్చేందుకు సన్నద్ధం అవుతోంది. ఈ నూతన సర్వీసు అందుబాటులోకి వస్తే 800 ఎంబి సామర్థ్యం కలిగిన సినిమాను రెప్పపాటులో డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ సర్వీసును అందుబాటులోకి తెచ్చేందుకు 90 కోట్ల డాలర్లు వెచ్చించాలని నిర్ణయించింది. 2017నాటికల్లా ఈ సర్వీసు ట్రయల్స్ నిర్వహించనున్నారు. 2020 డిసెంబర్‌నాటికి వాణిజ్య పరమైన సర్వీసులను అందుబాటులోకి తీసుకురావాలనుకుంటున్నారు. దక్షిణ కొరియాలో 2జి సర్వీసు 1990 సంవత్సరంలోనే అందుబాటులోకి వచ్చింది. 2000లో 3జి, 2010లో 4జి సేవలు ప్రారంభమయ్యాయి. ఇప్పుడు టెక్నాలజీ, సర్వీసుల పరంగా మరింత ముందుకువెళ్లడంపై దృష్టి పెట్టింది. యూరప్, చైనా, యుఎస్ వంటి దేశాలు కూడా 5జి టెక్నాలజీ అభివృద్ధిపై దృష్టి పెట్టాయి. 5జి టెక్నాలజీ అందుబాటులోకి వస్తే దీన్ని వినియోగించుకునేందుకు అవసరమైన మొబైల్ ఫోన్లను తయారు చేసే కంపెనీలకు కొత్త అవకాశాలు లభించే ఆస్కారం ఉంది.

ఇవీ 5జి ప్రత్యేకతలు

★ 4జి కన్నా 1,000 రెట్ల అధిక వేగంతో పనిచేస్తుంది. ★ ఇంటర్నెట్ గరిష్ఠ వేగం 1జిబిపిఎస్‌గా వుంటుంది. ★ 800 మెగాబైట్ల సినిమాను సైతం సెకనుకన్నా తక్కువ సమయంలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ★ గంటకు 500కి.మీ. వేగంతో ప్రయాణించే బుల్లెట్ ట్రెయిన్లలోనూ ఇంటర్నెట్‌ను యాక్సెస్ చేయవచ్చు. ★ఇదిలా ఉంటే.. 3జి, 4జి సర్వీసుల విస్తరణలో మన దేశం చాలా వెనుకబడి ఉంది. ఇప్పటికీ 3జి సర్వీసులు దేశవ్యాప్తంగా అందుబాటులో లేవు. ఇప్పుడిప్పుడే కొన్ని టెలికాం కంపెనీలు 4జి సేవలను విస్తరిస్తున్నాయి.

రచయిత సెల్ : 9490099219

అందుకున్నాం



ఉత్తమ ఆఫ్రికన్ కథలు
అనువాదం :
ఎలనాగ
వెల : 100/-
పేజీలు : 143
ప్రతులకు :
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
అన్ని బ్రాంచీలు

బంగారు తెలంగాణలో
చలనచిత్రం
వారాల ఆనంద్
వెల : 60/-, పేజీలు : 60
ప్రతులకు : ఇందిర,
ఇం.నెం.8-4-841,
హనుమాన్ నగర్,
కరీంనగర్. మరియు అన్ని
పుస్తక కేంద్రాలు





దర్పణం
డా॥ఎ.వి.వీరభద్రాచారి
వెల : 100/-
పేజీలు : 145
ప్రతులకు :
విశాలాంధ్ర, ప్రజాశక్తి,
నవోదయ, దిశ, నవోదయ
పుస్తక కేంద్రాలు

వెలుతురు పాట
కవిత్వం - కథలు - వ్యాసాలు
తంగెళ్ళపల్లి కనకాచారి
వెల : 100/-, పేజీలు : 81
ప్రతులకు : కామన్ దయాస్,
హౌస్‌నెం. 1..606, సీపీఐ
కాలనీ, బాలాజీ నగర్, శామీర్
పేట, రంగారెడ్డి. మరియు
ప్రజాశక్తి, విశాలాంధ్ర, దిశ,
నవోదయ, ఇతర పుస్తక
కేంద్రాలు.

■ సమీక్షలు

సరళమైన భాషలో బాలసాహిత్యం

చింతాదీక్షితులు, బాలసాహిత్యం
పేజీలు: 312, వెల: రూ. 230
ప్రతులకు: విశాలాంధ్ర పుస్తక కేంద్రాలు



చింతా దీక్షితులు పేరు చెప్పగానే చలం గుర్తుకొస్తారు. చలం రచించిన మ్యూజింగ్స్‌లోనూ, ఆత్మకథలోనూ, ఇతరేతర రచనల్లోనూ చింతా దీక్షితులు ప్రస్తావన ఉంటుంది. ఇక సుగాలీల గురించి రాసిన కథల ద్వారా సాహిత్యపాఠకులకు గుర్తుండిపోయిన రచయిత చింతా దీక్షితులు. జీవితమంతా శిశు హృదయంలోని స్వచ్ఛతను కాపాడుకుంటూ వచ్చారు. ఆ క్రమాన పిల్లలు నచ్చే మెచ్చే సాహిత్యాన్ని సృష్టించారు. బాలసాహిత్యం ఎలా వుండాలో తెలుసుకోవాలంటే దీక్షితులు రచించిన సాహిత్యం చదవాలి. నేటితరం పిల్లలు చదువుకోడానికి ఉపకరించే పుస్తకం 'చింతా దీక్షితులు బాల సాహిత్యం'. బాలల రచయితలు కూడా పిల్లల కోసం చేసే రచనలు ఎలా ఉండాలో తెలుసుకోవాలంటే ఈ పుస్తకం చదవాలి. క్లుప్తత, సంక్షిప్తత, సరళమైన భాష దీక్షితుల వారి బాలసాహిత్యం ప్రత్యేకత. చిన్న చిన్న వాక్యాలతో పిల్లల మనసు హత్తుకునే విధంగా కథ చెప్పడంలో ఆయన నైపుణ్యం ఆకట్టుకుంటుంది. పిల్లలు, పెద్దలు చదవదగ్గ పుస్తకమిది.

దళిత దృక్పథంలోని విశాలత్వం

దళిత కథలు, రచన: ఆచార్య కొలుకలూరి ఇనాక్
పేజీలు: 384, వెల: రూ. 250
ప్రతులకు: విశాలాంధ్ర పుస్తక కేంద్రాలు

తెలుగు కథాసాహిత్యాన్ని సుసంపన్నం చేసిన సాహిత్యకారుల్లో ఆచార్య కొలుకలూరి ఇనాక్ ఒకరు. పలుప్రక్రియల్లో విస్తారంగా రచనలు చేస్తున్న ఇనాక్‌గారు 'ఊరబావి' కథ ద్వారా దళిత జీవన సంవేదనల్ని బలంగా చెప్పారు. దళిత జీవనానుభవమే కాక, దళిత దృక్పథంలోంచి మొత్తం జీవితానికి సంబంధించిన కోణాల్ని పలు కథల్లో ఆవిష్కరించారు. 'దళిత కథలు' శీర్షికన వచ్చిన ఈ పుస్తకంలోని ముప్పయి కథలు దళిత దృక్పథంలోని విశాలత్వాన్ని చెబుతాయి. దళిత జీవితంలోని వైవిధ్యం, దళితులు లోకాన్ని ఎలా చూస్తున్నారు, లోకాన్ని దళితులు ఎలా చూస్తున్నారో ఈ కథలు చెబుతాయి. ఇటు గుంటూరు, అటు అనంతపురం జిల్లాలకు చెందిన మాండలిక భాషా సొగసులు ఈ కథల్లో చిత్రితమయ్యాయి. విభిన్న రంగాల్లో దళితుల వివక్షకు లైనన విధం, సమాజం ఎంతగా మారుతున్నా, దళితుల పట్ల వీడని చిన్నచూపు గురించి చాలా కథల్లో చెప్పారు. దళిత జీవితానుభవాల్లోని విశాలత్వాన్ని చూపే కథల సమాహారం ఈ పుస్తకం.

- అశోక్ కుమార్, 97000 00948

మీరూ రాయండి

మీరు చదివిన వాటిలో మీకు బాగా నచ్చిన పుస్తకం గురించి ఈ శీర్షికకు రాసి పంపండి. మీ ఫొటో కూడా జతచేయండి. పుస్తకంలో మీకు నచ్చిన అంశాల గురించి రాయండి. పుస్తకం ఎందుకు నచ్చిందో ఒకటి రెండు మాటల్లో చెబితే మంచిది. 'నాకు నచ్చిన పుస్తకం' శీర్షికన ప్రచురిస్తాం. మీ అభిప్రాయాలు చేరాల్సిన చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్లాట్ నెం.21/1, ఎం.హెచ్.భవన్, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగలింగంపల్లి, హైదరాబాద్-500030.

కొత్త ఊపిరిలోని తాత్వికశబ్దం



నీలాగే ఒకడుండేవాడు! (కవిత్వం)
రచన: నందకిశోర్
పేజీలు: 180, వెల: రూ. 80.
ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు

తెలుగు వచనం ఈ కాలానికి ఒక ఆధునిక దశకు చేరుకుందని చెప్పడానికి పెద్దగా సందేహాలవసరం లేదు. వస్తుదృష్టితో, వాద దృష్టితో వచనం అనేక పరిణామాలు పొందినప్పటికీ, వీటన్నిటికీ మించి మనోవైజ్ఞానిక భూమిక ఒకటి ఈ కాలపు కవిత్వంలో ప్రధానంగా కనిపిస్తుంది. దానికి కారణం ఈ కాలానికి భాష కేవలం మేధోగతమైంది గాదు. అభ్యాస గతమైంది గాదు. ప్రస్ఫుటంగా అది అనుభవికమైన అభివ్యక్తి పార్శ్వంలో భాగమైంది. అనేక పరిస్థితులు, కారణాల వల్ల ఏర్పడే సామాన్య సైకిక ఫలకం ఈ పరిణామానికి మూలంగా కనిపిస్తుంది.

తొలి సంపుటి అయినా తొలకరిలా కనిపించని నందకిశోర్ కవిత్వంలో ఈ తరహా వచనం కనిపిస్తుంది. వాఖ్యాన, ఆఖ్యాన భాగాల్లోంచి ఆత్మీకరణ చెందిన వచనం ఈ కవిత్వంలో ఉంది. సుమారు 36 ఖండికలు, మరో నాలుగు భాగాలున్న ఈ సంపుటిలో దర్శనగతమైన తాత్త్విక క్షేత్రం పరుచుకుంది. సందర్భం, పాత్రలు వంటి భౌతికాంశాల కంటే అందులోని అంశమే ప్రధాన హేతువు. శైలి గురించి మాట్లాడుకుంటే... ప్రాతిపదిక వాక్యాలు లేకుండానే కవిత్వంలోకి తీసుకెళ్లటం, సంభాషణాత్మకంగా ఉండటం, సంక్షిప్తంగా ఉండటం... అనేక వాక్యాల్లో ఒక స్పర్శాగతమైన తాత్విక దృశ్యం నిండిపోవడం కనిపిస్తాయి.

పూలభాష, రహస్యం, ప్రేమ, సూక్తి, అద్దం, నిశీథిని లాంటి చాలా కవితలు ఇలాంటి వాక్యాలకు జన్మనిచ్చాయి. కొన్నిసార్లు తాత్త్వికత మనో వైజ్ఞానికత నుంచి అధివాస్తవికత దాక వెళ్లిన కవితలున్నాయి. గుర్తు (పే.20) అలాంటిదే. కేవలం హృదయగతమైన సంఘర్షణను చెప్పడం వల్ల వస్తు సంబంధమైన జ్ఞానాన్ని ఈ కవితలు పాఠకుడి నుండి అపేక్షిస్తాయి. అనేక కోణాల నుంచి ఆవిష్కరింపబడే సౌందర్యం, తాత్వికత ఈ కవిత్వాన్ని నిలబెడతాయి.

నందు కవిత్వంలో రెండు పార్శ్వాలున్నాయి. ఒకటి ప్రకృతి. రెండు: జీవితం. వీటి మధ్యలో సమన్వయరూపంలో కదిలే తాత్వికధార వుంది. దానిని పట్టిచూపే కవితాపాదాలు ఎన్నో అతని కవిత్వంలో చూస్తాం. అర్థవంతమైన ప్రయోగాలు, పదబంధాలు ఈ కవిత్వంలో తాజాతనాన్ని నిలబెడతాయి. ఈ తాజాతనమే నందు కవిత్వాన్ని పరిమళింపజేస్తుంది.

- ఎం.నారాయణశర్మ, 9848348502

అణు విపత్తుపై అప్రమత్తుల్ని చేసే నవల



అణుజ్వాల (నవల), రచన: డా.కె.కిరణ్‌కుమార్
పేజీలు: 152, వెల: రూ. 70.
ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు

చరిత్రనీ, సైన్స్‌నీ మిళితం చేసి డా. కె.కిరణ్‌కుమార్ రాసిన నవల 'అణుజ్వాల'. ఇది ఒక పరిశోధనాత్మక నవల కూడా. హిరోషిమా బాధితుల గాథల్ని ప్రస్తావిస్తూ అణుబాంబు వల్ల వాటిల్లే ముప్పును శక్తివంతంగా చెప్పిన నవల ఇది. అణ్వాస్త్రాల మీద ప్రముఖుల చేసిన వ్యాఖ్యానాలు, అణుబాంబుకు సంబంధించిన ప్రత్యేక కథనాలు, చరిత్రాత్మక సంఘటనలు కూడా పుస్తకం చివరలో చేర్చారు. కనుక నవల చదివిన పాఠకుడు కల్పనకీ, వాస్తవాలకీ గల తేడాను కూడా తెలుసుకోగలుగుతాడు. కల్పన సైతం వాస్తవానికి ఎంత దగ్గరగా వున్నదో అర్థం చేసుకునే వీలుంది. ముఖ్యంగా సరళమైన శైలి కారణంగా ఈ నవల చదివించే గుణాన్ని సంతరించుకుంది.

ఆంగ్లభాష నేర్చుకోడానికి ఉపకరణాలు



స్పోకెన్ ఇంగ్లీషు కోర్సు మేడ్ ఈజీ
పేజీలు: 96,
వెల: 50
ఇంగ్లీషు కమ్యూనికేషన్ స్కిల్స్
పేజీలు: 96, వెల: రూ. 40
ప్రతులకు:
ప్రముఖ పుస్తక కేంద్రాలు

ఏ రంగంలో వున్న వారికయినా ఆంగ్లభాష తప్పనిసరి అవసరమైంది. కనుక వివిధ రంగాల్లో వారికి ఉపకరించేవిధంగా ఆంగ్లభాషకు సంబంధించి డా. కె.కిరణ్‌కుమార్ రెండు పుస్తకాలు రాశారు. ఒకటి: స్పోకెన్ ఇంగ్లీషు కోర్సు మేడ్ ఈజీ, రెండు: ఇంగ్లీషు కమ్యూనికేషన్ స్కిల్స్. ప్రాథమిక సూత్రాల్ని, మెళకువల్ని ఈ రెండు పుస్తకాలు అందిస్తాయి. మాట్లాడటం, రాయటానికి సంబంధించిన సాధారణ ఇంగ్లీషు పరిజ్ఞానాన్ని అందించడానికి ఉపకరిస్తాయి. కమ్యూనికేషన్ స్కిల్స్‌లో ఇంగ్లీషులో కనీసంగా ఉత్తరాలు రాయడం, వ్యాసాలు రాయడం, పోటీ పరీక్షల్లో వ్యాసాలు రాయడం వంటివి ఎలా చేకూరుతాయో వివరించారు. ప్రశ్నలు అడగడం, జవాబులు చెప్పడం, ఇంటర్వ్యూల్ని ఎదుర్కోవడం, చిన్నచిన్న మెసేజ్‌లు పంపించడం ఎలానో సోదాహరణంగా నేర్పారు. ఈ రెండు పుస్తకాలని చదివి, వాటిని ఇచ్చిన అంశాల్ని ప్రాక్టీస్‌లో పెడితే ఇంగ్లీషు నేర్చుకోవడం ఇంత సులభమా అని ఆశ్చర్యపోతారు. ఈవిధంగా సరళమైన పద్ధతిలో ఈ పుస్తకాల్ని రాయడంలో కిరణ్‌కుమార్ చూపిన సృజనాత్మకత మెచ్చదగింది.

■ ఈ వారం కవిత్వం

బోటనీ

పొద్దున్నే ఒక పెద్దాయన
ఔషధం మొక్కలను బుట్టల్లో సైకిలుకు కట్టుకుని
అపర చరకుడిలా
గ్రౌండుకు వచ్చి నిల్చున్నాడు

చెట్టు పేరు
చెట్టు పెరిగే ప్రాంతం
చెట్టు ఆయుర్దాయం
చెట్టు జీవ లక్షణాలు క్రియలు
చెట్టు సృజనాంశాలైన
ఆకు చిగురు పూవు పిందె కాయ పండూ కొమ్మలు అన్నిటినీ
ఎరుక పరుస్తూ
తలలో నాలుక వలె మొక్కకో పలక
ఆ బుట్టల్లో సాక్షరతగా పెనవేసుకొన్నాయి

చెట్లే ఆయనో
ఆయనే చెట్లో అన్నట్టు
పసరు వాసన వేస్తూ సాక్సో ఫోపై
మారు మోగుతున్నాడతను

పాదచారులు
చెట్లు లేని ప్రపంచంలోకి వచ్చిన వాళ్లూ
వృక్ష రహిత లోకంలో జీవిస్తున్న వాళ్లూ
వింటూ చూస్తూ
అబ్బుర పడి చుట్టుముట్టినప్పుడు
ఆయనో చెట్ల కాశ్మీరంలా ఉన్నాడు

ఏది దేనికి మందో
ఏది వన ప్రపంచంలో దేనికంటే ముందో
చెప్పే శాస్త్ర పాఠంలోకి
ఆయనో ఆచార్యుడిలా లీనమయ్యాడు

ఈ మొక్కలు పెంచితే చెట్లు
గతం తాలూకు రుగ్మతలకు చెందినవని కొందరు
నేడూ అవసరమేనని మరికొందరు
భవిష్యత్తులోనూ పనికొస్తాయని ఇంకొందరు
విస్సన్న వేదం చదువుతున్నారు
రోబోల కాలంలో
రోటి దంపుళ్లూ నూరుళ్ళూ!
మొక్కలతో చెట్లతో ఇంకా మురికి వైద్యం ఏమిటి? అంటున్న
అంగారక గ్రహాలూ అక్కడున్నారు

ఔను
మమ్మల్ని వెతుక్కుంటూ వచ్చే వాళ్లకు
మేం ఏమిటో తెలుస్తుంది తప్ప
మేమే చెంతకొస్తే చులకన అగడ్తలో
పడతోస్తారులే అంటూ
బోటనీ లాంగ్వేజ్‌లో
తమలో తాము మాట్లాడుకుంటున్నాయి
ఆ పురావన మొక్కలు

హోటల్లో
కాపీ టిఫిన్ల కంటే చౌకే అయినా
చూసి తాకి కొసరి
జేబులోపలి దాకా చేతులూ వెళ్ళి
అనవసరం అనుకున్న విబూదరేఖ వద్ద ఏకీబావానికి వచ్చి
ఎప్పీ కష్టమర్లై వెళ్ళిపోతున్న నగరజీవులతో
ఆ వయోవృక్షం ఇట్లా శెలవిచ్చాడు
బబూ... అమ్మా...
'చరిత్ర లాగే నొప్పులూ రోగాలూ
పునరావృతం అవుతాయి' అని.

- డా॥బెల్లి యాదయ్య

సెల్ : 9848392690

నిరీక్ష

ధనికుల కళ్లెప్పుడు
దిక్కులేని జనం పాదరక్షల్లానే
మరి పాదరక్షల గుండెల్లోంచి
ఆవేశపు మొలలెప్పుడు మొలుస్తాయో?

యజమాని బుద్ధులే

మంత్రి గారి కుక్క
రొట్టెలు తినదు - మాంసం తప్ప
నీళ్ల తాగదు - రక్తం తప్ప
దీనికన్నీ యజమాని బుద్ధులే

కాకులు

బైట చీకటి - ప్రకృతి కాకుల్ని ఈనినట్టు -
నల్లని చీకటి
లోన గదిలో బల్బువిసిరే వెలుగులో
కూర్చున్నాను
మెదడు పదునుగావుంది : ఆలోచనా
రెక్కలు విప్పుకుంటున్నాయి
గోడమీద గడియారం పరుగెడ్తూ
అరుస్తూంది - ముళ్ల నోళ్లతో
కలాన్ని కదిపించాను
కాగితం నిండా కాకులే కాకులు

-కోటం చంద్రశేఖర్,

9492043348

ఇది భారతదేశంలో సముద్రంపై వేసిన మొట్ట మొదటి వంతెన. రామేశ్వరం నుండి పంబన్ ద్వీపానికి వేశారు. దీని పొడవు 2.3 కిలోమీటర్లు. ఈ మార్గంలో బ్రిడ్జి కిందనుండి వచ్చే ఓడలకు దారి ఇచ్చే విధంగా ఈ వంతెనను నిర్మించారు.

పంబన్ రైలు వంతెన



పంబన్ రోడ్డు వంతెన



ఈ వంతెనను కొత్త ముంబాయి, పాత ముంబాయిలను కలపడానికి నిర్మించారు. దీని పొడవు 1,837 మీటర్లు. దీన్ని కేవలం మోటార్ వాహనాలు ప్రయాణించడానికి మాత్రమే ఉపయోగిస్తారు.

వషి వంతెన

ఐరోలి వంతెన

రెండు ముంబాయి నగరాలను కలిపే మరో సముద్ర వంతెన ఐరోలి. దీని పొడవు 3.8 కిలోమీటర్లు.

ఇక్కడ కనిపిస్తున్న బ్రిడ్జిలన్నీ సముద్రం మీద నిర్మించినవే. సులభంగా, తక్కువ సమయంలో ఎక్కువ దూరం ప్రయాణించడానికి వీలుగా ఈ వంతెనల నిర్మాణం చేపట్టారు. వీటిల్లో నాలుగు బ్రిడ్జ్‌లు బాంబేలో ఉంటే మరొకటి రామేశ్వరంలో ఉంది. వీటి నిర్మాణం వల్ల అరగంట సమయం పట్టే ప్రయాణం కేవలం పది నిముషాల లోపే గమ్యం చేరొచ్చు.

సముద్ర వంతెనలు

బంద్రా వర్లి వంతెన

బంద్రా వర్లి సీ లింక్ గా పిలవబడుతున్న ఈ వంతెన భారతదేశంలో సముద్రం పై కట్టిన వంతెనల్లో అన్నిటికంటే పొడవైనది. ఇది బాంబేలోని బంద్రా నుండి వర్లి వరకు 5.6 కిలోమీటర్ల పొడవున అరేబియా సముద్రంలో కట్టారు. ఒకేసారి ఈ వంతెన మీద ఎనిమిది వాహనాలు వెళ్లొచ్చు.



3 డి ఓరిగామి

ముచ్చటగా ఉన్న ఈ బొమ్మల్ని చూస్తుంటే తీసుకుని షోకేస్‌లో పెట్టుకోవాలనిపించేలా ఉన్నాయి కదూ! ఇంతకీ ఇవి దేనితో తయారు చేశారో తెలుసా? పేపర్‌తో. కేవలం రంగు రంగుల కాగితాలతో ఇలా విభిన్నమైన ఆకారాలు చేశారంటే ఆశ్చర్యంగా ఉంది కదా! పేపర్‌తో ఇలాంటి బొమ్మలు తయారు చేయడాన్ని 3 డి ఓరిగామి అంటారు. 3×4 సెంటీ మీటర్ల పేపర్‌ను రకరకాలుగా ఎన్నో మడతలు పెడతారు. అలాంటి కొన్ని వందల పేపర్ ముక్కలను ఓ పద్ధతి ప్రకారం కలిపితే ఇలా అందమైన ఆకృతులు తయారవుతాయి.